# మహాకవి మరణం



నిర్లిప్తపు చీకటి కమ్ముకుంటున్న సాయంకాలంలోకి, ఉత్సవాల కోలాహలాన్ని వెంట బెట్టుకొచ్చాడు విశ్వనాథన్. ఆయన వచ్చే సమయానికి పడక కుర్చీలో కూర్చుని యువకవి నజీర్ వ్రాసిన కవితా సంపుటి చదువుకుంటున్నాను.

"ఇదేమిటీ మూల కూర్చుని కవిత్వం చదువుకుంటున్నారు? బయట కోలాహలం మీ చెవిన బడలేదా? అవతల ప్రపంచమంతా మీ పేరు హోరెత్తుతుంటే మీరిక్కడ కవితా పఠనంలో మునిగిపోయారా? లేవండి! మీ ఏకాంతపు గవాక్షాలు తెరిచి బయటకు రండి!" అన్నాడు కాస్త సస్పెన్సు మిళిమైన స్వరంతో.

విశ్వనాథన్ ఓ ప్రైవేట్ కాలేజీ ప్రిన్సిపాలు. కవిత్వమన్నా, కవులన్నా ప్రాణం. గుంటూరులో సాహితీ ప్రియులందరికీ 'సరాయ్' లాంటివాడు. ఈ హడావుడికి "ఏమిటి సంగతి?" అంటూ సుధ కూడా వంట గదిలోంచి బయటకుచి వచ్చింది.

సుధ మాటలు పూర్తి కాకముందే తుఫానులా ఊడిపడ్డాడు యువకవి పార్వతీ శంకర్. అతని వెంట అంతగా పరిచయం లేని కవి మిత్రులు, సాహితీ అభిమానులు పదిమంది దాకా వున్నారు. "జ్ఞానపీఠం అవార్డు విజేతకు మా శుభాకాంక్షలు" అంటూ మెడలో పూలహారం వేశాడు పార్వతీ శంకర్.

"శుభాకాంక్షలు శ్రీనివాసరావుగారూ" మరో సాహితీ మిత్రుడు రామమోహన్ బొకేతో సహా ప్రత్యక్షమయ్యాడు. మూగబోయిన సాయం కాలం క్రమంగా ఉల్లాస గీతాల కచేరీ అయ్యింది. మిత్రులు, సన్నిహితులు, యువకవులు ఒక్క సారిగా అంతమందిని చూడడం గొప్ప అనుభూతి. శుభాకాంక్షల కుహూ కుహూలతో రాత్రివృక్షం కోలాహలమయింది. మధ్యలో ఇద్దరు విలేకర్లు

ఫోటో అంటూ విసిగించారు. రాత్రి పది గంటల వరకూ ఈ కోలాహలం తగ్గలేదు. ఈ ప్రశంసలూ, పొగడ్తలూ, పూలహారాలు; ఈ కాసిన్ని ఉద్వేగపు క్షణాలూ అన్నీ గొంతులోకి జారుతున్న మద్యంలా నిషా నిచ్చాయి.

"ఇంతకూ ఈ అవార్డు స్వీకరిస్తున్నారా?" రాత్రి భోజనం సమయంలో సుధ వేసిన ప్రశ్నతో ఒక్కసారిగా నిషా దిగిపోయింది. సాహితీ అభిమానులు వదిలి వెళ్ళిన పూలహారాలు, బొకేలు నా వైపు ప్రశ్న గుర్తుల్లా చూస్తున్నాయి.

* * *

సుషుప్తికీ, జాగృతికీ మధ్య అట్టే వ్యత్యాసం లేని అతి బద్ధకపు జీవితాన్ని గడుపుతున్న వృద్ధ దంపతులము మేము. రెండు మూడు గంటల పాటు న్యూస్ పేపరు చదవడం, మార్కెట్‌కు పోవడం, లైబ్రరీలో కాసేపు, విశ్వనాథన్ లాంటి సాహితీ మిత్రులతో భేటీ, అంతట్లో సాయంకాలం వచ్చేస్తుంది. సాయంకాలం అయ్యేసరికి మనసు ఇండియా కాఫీ హౌస్‌పై మరులుకొంటుంది. ఇండియా కాఫీ హౌస్ మా స్పిరుచ్యువల్ హోమ్. కవి మిత్రులు, రాజకీయ నాయకులు, అభిమానులు కరపత్రాలు, మానిఫెస్టోలు, కవితా సంపుటాలు. అప్పుడే ప్రసవించిన కవితలను మనసుకు హత్తుకొని ముద్దు చేయడం సాహితీ మిత్రులతో పిచ్చాపాటీ, గ్రంథ విమర్శలు, అప్పుడప్పుడూ కవుల ప్రైవేటు జీవితాలపై భూతద్దాలు ఫోకస్ చేయడం, ఇండియా కాఫీ హౌస్ లిటరరీ ఎమ్యూజ్‌మెంట్ పార్కు లాంటిది. రాత్రి ఏ పదకొండుకో ఇంటికి చేరడం, యిదీ మా రొటీన్.

ఎప్పుడో ఒక ఉరుము లాగా, మెరుపులాగా, యువకవో, కవయిత్రో తమ కవితలతో మా యింటిపై దాడి చేస్తారు. వాళ్ళొచ్చిన ఆ కాసిన్ని క్షణాలు అనూహ్యమైన సంచలనం మా యింట్లో. సుధ కూడా కళ్ళలోని నిర్లిప్తపు మేఘాల్ని చిమ్ముకుని విప్పారిన వెలుగుల కళ్ళతో కవిత్వాన్నీ, కబుర్లనీ ఆస్వాదిస్తుంది. అదో పండుగ మాకు. నెలకు ఒకటో, రెండో అలాంటి పండుగలు తటస్థపడతాయి. చనిపోయిన మా అబ్బాయి స్నేహితులో, క్లాస్‌మేట్లో ఎప్పుడైనా పలకరింపుగా వచ్చి కన్నీటి చిత్తడుల వర్షాకాలాన్ని తీసుకువస్తారు. గుండెల్లో గుబులు, కళ్ళలో నల్ల మబ్బులు, పెద్దగా మాట్లాడుకోము. ఒక సామూహిక మౌనంతో పరస్పరం పలకరించుకుని, గుండెల్ని తడుముకొని, మౌనం లోనే ఎవరికి వాళ్ళం విడిపోతాము. ఆ తరువాత అన్నం మీద, సోకాల్డ్ రొటీన్ మీద విరక్తి. రెండు మూడు రోజుల తరువాత మళ్ళీ మామూలు జీవితం తన బద్ధకపు టెంటకిల్స్‌తో మమ్మల్ని కబళిస్తుంది.

కవిగా నాకు 'మెనోపాజ్' వచ్చినట్లే. కవిత్వం నా వేళ్ళ కొసల మధ్య ఇమడని జవనాశ్వం అయ్యింది. ఉగాదికో, రిపబ్లిక్‌డేకో రేడియో వాళ్ళకో, పత్రికల వాళ్ళకో ఓ మొక్కుబడి కవిత రాస్తాను. అత్యంత ప్రయాసపడి మృత శిశువును కన్న మాతృమూర్తిలా వుంటుంది నా పరిస్థితి. ఆ కవితల్ని అచ్చులో చూసుకోవాలన్నా భయమే. బీడుబడ్డ పొలాల్లో ధాన్యపు పంటలకు బదులు నాసిరకం పంటలేవో పండిస్తున్నట్లు, ప్రస్తుతం

కవిత్వాన్ని వదిలి వచనాన్ని ఆశ్రయించాను. కథలు, వ్యాసాలు, ఒకటిరెండు నవలలు వ్రాశాను ఈ మధ్య కాలంలో. 'శ్రీనివాసరావు కవి మాత్రమే కాదు. అన్ని సాహితీ ప్రక్రియలకు అధినాథుడు' అని కొందరు విమర్శకులు మెచ్చుకున్నా, నా వచన రచనలలోని క్వాలిటీ లోపాన్ని నేను నిర్మొహమాటంగా అంగీకరిస్తాను.

రాత్రి పది దాటింది. సీరియస్‌గా ఇంటిని సర్దే కార్యక్రమంలో నిమగ్నమయింది సుధ. మబ్బులన్నీ తొలగిపోయి, స్వచ్ఛంగా, నిండుగా వుంది ఆకాశం. వెన్నెల రాత్రి. వజ్రాలు పొదిగిన పిడిబాకులా చంద్రుడు.

"బ్యాంకులో సరిగ్గా రెండొందల ఇరవై వున్నాయి. ఈ ఇన్ఫ్లేషన్ రోజుల్లో ఏది ముట్టుకున్నా భగ్గుమంటుంది. ఇద్దరికీ కలిపి నెలకు ఐదు వందలన్నా కావాలి. ఎన్నిసార్లు ఫోన్ చేసినా ప్రజాంధ్ర పబ్లిషర్సు వాళ్ళు శ్రీనివాసరావుగారి పుస్తకాలేమీ అమ్ముడవడం లేదు. రాయల్టీ పంపలేక పోతున్నాము. సారీ అండీ అంటూ ఫోన్ పెట్టేస్తారు నిర్లక్ష్యంగా. 'సార్ చేత ఆ నవల పూర్తి చేయించండి' చెక్కు పంపిస్తానంటాడు ఆంధ్ర మిత్ర ఎడిటరు. వాడేమి ఎడిటర్? వాడికన్నా బ్లాక్‌మెయిలర్ నయం. 'రాసిన చిత్తుప్రతి తగలబడి పోయింది. జరిగిన గొడవ మీకూ తెలుసు కదా, మళ్ళీ ఇప్పటికిప్పుడు రాయటమంటే మాటలా? ఆయన మానసికంగా నలిగిపోయి వున్నారు. వీలు చూసుకొని రాస్తారు. ప్రస్తుతానికో ఐదువేలు సర్దండి అంటే, చూస్తున్నారుగా సర్క్యులేషన్ అంతంత మాత్రంగానే వుంది. త్వరలోనే పంపుతాను' అంటూ దాటవేస్తాడు. చేనేత కార్మికులకు, ప్రత్తి రైతులకు కాకుండా కవులకు కూడా ఆంధ్ర దేశంలో ఆకలి చావులు తప్పేట్టు లేవు అనుకుంటున్న సమయానికి ఈ అవార్డు వచ్చింది. తిరస్కరించడానికి నాకైతే కారణాలేమీ కనబడటం లేదు. కవిత్వాన్ని జీవనాధారంగా పెట్టుకొని ఈ ఆంధ్ర దేశంలో జీవించడమే గొప్ప. అవార్డులు తిరస్కరించడం లాంటి ఆదర్శాల లగ్జరీ మనకొద్దు."

నిద్రకు ఉపక్రమించే ముందు "అవార్డు తీసుకుంటున్నారా?" అంటూ తను వేసిన ప్రశ్నకు తానే సమాధానం చెప్పింది సుధ.

రెండు మూడేళ్ళక్రితం అయితే సుధ నిర్ణయం నాకో షాక్‌లా వుండేది. ఇప్పటి సుధ వేరు. సుధలో స్పష్టమైన మార్పు కన్పిస్తూంది. ఒకప్పుడు "నిబద్ధత లేనివాడు కవి ఎట్లా అవుతాడు?" అని వాదించేది. "కవి ప్రజల మధ్య తిరగాలి. కవిత్వంపైనా, కవి పైనా గుణాత్మకమైన తీర్పు నివ్వాల్సింది ప్రజలే" అనేది. అప్పటి సుధ వేరు. రాజకీయాలు, కవితా పఠనాలు, కవి మిత్రులతో పరిచయాలు, సభలు - సమావేశాలు, జీవితమంటే అవేనేమో అన్నట్టుగా గడిపేది. ఇవాల్టి సుధ అతి సాధారణమైన గృహిణి. ఆ రోజు భోజనం గురించి, మార్కెట్టులో ధరల తీరు గురించి తప్ప మరో విషయం మాట్లాడదు. "సహజ పరిణామమా? అసహజ పరిణామమా?" అని అడిగితే, విషాదంగా నవ్వి "వయసు తెచ్చే అత్యంత సహజమైన పరిణామమే ఇది. మీరేం వర్రీ కాకండి!" అంటుంది. యాభై యేళ్ళ పాటు గడిపిన జీవితం హఠాత్తుగా తనది కాకుండా పోవడం సహజ పరిణామమా? ఊహు! తనపై తాను విధించుకున్న శిక్ష ఇది!

ఎదిగి వచ్చిన పిల్లవాడి బలవన్మరణం అదో పెద్దగాయం మా మనసులపై. ఆ విషాదం నుండి పూర్తిగా కోలుకోకముందే 'జనతంత్ర' పార్టీకార్యకర్తలు మా ఇంటిపైకి దాడికొచ్చారు. "పార్టీ నాకు తల్లీ, తండ్రీ, సర్వస్వమూ అనుకొన్నాను ఇన్నాళ్ళు. నాకు జ్ఞానోదయాన్ని కలిగించడానికే ఈ దాడిని ఏర్పరచినట్టున్నారు పార్టీ పెద్దలు. పార్టీ అంటే మెదడు, హృదయం లేని 'ఎ' క్లాసు గూండా అని ఈవేళ అర్థమయింది. మీకూ అర్థమయింది కదా? లేక ఇంకా ఏమయినా భ్రమలున్నాయా?" సుధ రాజకీయ జీవితానికి ఈ మాటలే ఎపిటాఫ్ లాంటివి.

1970 తరువాత "ఇక రాయటం మానివేయండి. బయట అద్భుతమైన కవిత్వాన్ని వెలయిస్తున్నారు యువ కవులు. వాళ్ళను మెచ్చుకోండి! ప్రోత్సహించండి! మీ వార్ధక్యాన్ని హుందాగా ఒప్పుకోండి!" అంటుండేది సుధ.

పార్టీ నేతలు ఈ సలహాకు మండిపడ్డారు. "ఏదో ఒకటి రాయటం ముఖ్యం. మీరేది రాసినా అదో గొప్ప టానిక్‌లా పని చేస్తుంది మన కార్యకర్తలపై. మీరు రాయటం మానకండి!" అంటూ సతాయించేవాళ్ళు. ఒక్కోసారి నా విశ్వాసాల మీద, నమ్మకాల మీద కూడా నిర్దయగా దాడిచేసేవాళ్ళు. క్రమశిక్షణ పేరుతో నన్నో యంత్ర పరికరంలా, రాత పనిముట్టుగా వాడుకునేవాళ్ళు. అప్పట్లోనే ఎమర్జెన్సీ విధించారు. జన జీవితంపై ప్రభుత్వం మోపిన ఉక్కుపాదం అని నేను గట్టిగా నమ్మాను. పార్టీ ఆలోచన భిన్నంగా వుంది. సోషలిజానికి ఇదో షార్ట్‌కట్‌లా భ్రమపడింది. ఎమర్జెన్సీకి అనుకూలంగా కవితలు రాయమని తాఖీదు ఇచ్చారు. అసాధ్యం అంటూ ఖండితంగా చెప్పేను. "పార్టీ ఆదేశం" అని బెదిరించారు. "పార్టీ నుంచి బహిష్కరించాల్సి వస్తుంది", "పార్టీ మీకు జీవన భృతిగా ఇస్తున్న ఐదు వందల్ని ఇవ్వడం ఆపివేస్తాము!" ఈ బెదిరింపులన్నిటికీ మౌనమే నా సమాధానం. రెండు మూడు సంజాయిషీ నోటీసుల తరువాత పార్టీ నా విషయాన్ని మర్చిపోయింది. నేనూ, పార్టీకీ నాకు పెద్ద అనుబంధం ఏమీ లేనట్లుగా ఏమ్నీషియా నటించాను. ఆ సంవత్సరం పార్టీ సభ్యత్వ రుసుం కూడా కట్టలేదు.

నన్నుపట్టి బంధించి వుంచిన దేని నుంచో హఠాత్తుగా నాకు స్వేచ్ఛ లభించినట్లుగా అనిపించింది. మనసుకు రెక్కలు మొలిచినట్లుగా వుంది. ఒకానొక నిర్దేశితమైన బాటలోనే వెళుతున్న నాకు వందలాది రహదారులు స్వాగత హస్తాలతో ఎదురైనట్లుగా వుంది. "ఈ స్వేచ్ఛ మత్తు పదార్థం లాంటిది! జాగ్రత్త సుమా!" అంటూ సుధ హెచ్చరిస్తున్నా పట్టించుకోని స్థితి.

కథలు, కవితలు, వ్యాసాలు పుంఖానుపుంఖంగా ఉత్పత్తి చేసే రచనా యంత్రాన్ని అయ్యాను. 'ఏ మంచికీ హాని చేయక, ఏ చెడుకూ మేలు చేయక' రచనలు సాగాలనే ప్రామాణికతను సైతం మరచి టన్నులకొద్దీ చెత్తను సృజించాను. కవిగా నేను పశ్చాత్తాప పడాల్సినక్షణాలివి. కానీ అప్పట్లో ఈ స్వేచ్ఛా భావన ఒక వ్యాధిలా నన్ను ఆక్రమించుకుంది.

'ఆంధ్రమిత్రలో జ్ఞాపకాలం' అంటూ శీర్షిక, వారం వారం నలభై, యాభై ల నాటి, సాహితీ జ్ఞాపకాల్ని రాస్తూ వచ్చాను. సాహితీ చర్చల్లో తప్పనిసరిగా రాజకీయాల గురించిన

చర్చ, ప్రస్తావన వచ్చేది. ఈ శీర్షిక పదివారాలు గడిచినాక జనతంత్ర పార్టీ హఠాత్తుగా మేలుకొని రాజకీయాల గురించి, నిబద్ధమైన సాహిత్యాన్ని గురించి చర్చించే నైతిక హక్కు నాకు లేదంటూ విమర్శను లేవదీసింది. "పోరాటానికి భయపడి పార్టీ నుంచి పారిపోయిన కవి బృహన్నల మరో మెట్టు దిగజారి తల్లిలాంటి పార్టీకి వెన్నుపోటు పొడవడానికి సిద్ధమయ్యాడు. జ్ఞాపకాల ముసుగులో పార్టీపై బురద చల్లడమే ఈయన ఆశయం. వారపత్రికలు విసిరే ఎంగిలి మెతుకుల కోసం ఆశ్రయమిచ్చిన చెట్టులాంటి పార్టీనే నరికివేయగల ఈ కవిని ప్రజలు ఎన్నటికీ క్షమించరు. ఎప్పుడో తాతలకాలం నాడు రాసిన నాలుగైదు కవితల్ని చూపిస్తూ నేనూ మహాకవినే అని ఫోజు పెట్టే ఈ వంచక కవికి ప్రజలే గుణపాఠం నేర్పుతారు" అంటూ కఠినమైన భాషలో ఒక కరపత్రం వెలువడింది. ఆవేశం ఆపుకోలేని కొంతమంది యువ కార్యకర్తలు ఊరేగింపుగా మాయింటిపైకి దాడికొచ్చారు. "ప్రజాద్రోహి కోలాహలం శ్రీనివాసరావు నశించాలి!" "వెన్నుపోటు కవి శ్రీనివాసరావు నశించాలి!" "డబ్బుకు అమ్ముడైన నకిలీ కవి నశించాలి!" అంటూ నినాదాలు చేసుకుంటూ వచ్చారు.

అది ఊరేగింపు కాదు, దాడి. కవిగా నాపై చూపాల్సిన గౌరవాన్ని అటుంచి, ఇద్దరు వృద్ధులపై చూపవలసిన కరుణ, జాలి కూడా లేకుండా నా ఇంటిపై దొమ్మీ చేశారు. అపురూపంగా చూసుకునే నా లైబ్రరీని చిందర వందర చేశారు. అముద్రిత రచనల్ని, 'ఆంధ్రమిత్ర'లో సీరియల్‌గా రానున్న ఒక నవల వ్రాతప్రతిని బహిరంగంగా తగలబెట్టారు. ఉన్న రెండుకుర్చీలు విరిగి పొయ్యాయి. గోడలపైనున్న మహాకవుల చిత్రపటాలు, మార్క్స్, లెనిన్ చిత్రపటాలు రోడ్డుపైకి విసిరేశారు. ఒక కవి అంతరంగిక స్వప్నలోకాన్ని నిర్దయగా ధ్వంసం చేశారు. చుట్టూ మూగిన వందలాది జనం 'సజీవ నాటకాన్ని' చూస్తున్నట్లుగా నిలబడిపోయారు. ఎవరిలోనూ స్పందన లేదు. "నలభై యేళ్ళ సుదీర్ఘమైన కవితా ప్రస్థానానికి చూశారా ఎంత గొప్ప సన్మానమో?" అంటూ నిట్టూర్చింది సుధ.

## 2

ఇండియా కాఫీ హౌస్ పేరుకు కాఫీ హొటల్ అయినా అదో మినీ కళావేదిక. నాలాంటి ఎందరో కళాకారులకు సాయంకాలాలు ఆశ్రయం యిచ్చి ఆదరించే స్పిరిట్యువల్ హొమ్. రెస్టారెంట్లని, కాఫీ హౌస్‌లని కళావేదికలుగా మార్చే సాంప్రదాయం బెంగాలీలది. ఏ కారణం చేతో బెంగాల్ నుండి యిటు వలస వచ్చిన అరవింద కుమార్ చటర్జీ పందొమ్మిది వందల అరవైలో ఈ హొటల్ పెట్టాడు. రవీంద్రుని ఫోటో, నందలాల్ బోస్, రామ్‌కింకర్‌ల తైలవర్ణ చిత్రాలు, స్పీకర్ల లోంచి మంద్రంగా ప్రవహించే షహనాయో, సితారో లోపల అడుగుపెడుతూనే చిత్రమైన వివశత్వంలోకి జారిపోతాము. ఒకపూట కాఫీహౌస్‌కు వెళ్ళకపోతే ఆ రోజంతా వెలితిగానే వుంటుంది. సుధ మాటల్లో చెప్పాలంటే "నశ్యం, సిగిరెట్లులాగా ఈ కాఫీ హౌస్ కూడా ఒక వ్యసనంలా మారింది" నా విషయంలో.

తొలి రోజుల్లో సుధా, నేను కలిసి వచ్చేవాళ్ళము. తరువాత మా పిల్లవాడితో సహా

వచ్చేవాళ్ళము. కాఫీ హౌస్‌లో అడుగు పెడుతూనే దైనందిన జీవితానికి అవసరమైన మర్యాద, మప్పితాల మందపు తొడుగుల్ని వదిలేస్తాము. వయసు అంతరాలు, సాంఘికమైన స్థాయి బేధాలు లేని మిత్రుల కూటమిలోకి దూరిపోతాము. జనతంత్ర పార్టీ కార్యకర్తల దాడి తర్వాత సుధ కాఫీ హౌస్‌కు రావడాన్ని కూడా ఆపివేసింది. "ఇదో వెర్రి ఆవేశం. ఆత్మహత్యా సదృశమైన ఆవేశం. జీవగృహానికి వెలుగునందించే ద్వారాలన్నిటినీ మూసివేసుకుంటూ పోతే, అదో సమాధిలా మారిపోతుంది. ఈపాటి కాలక్షేపం కూడా లేకపోతే ముసలితనం మనకో పనిష్మెంటు అవుతుంది" అని ఎంతగా నచ్చ చెప్పినా సుధ మళ్ళీ కాఫీ హౌస్ వైపుకు రానేలేదు. సుధలేని కాఫీహౌస్ సమావేశాలు చప్పగా వుండేవి. సుధది చక్కని కంఠం. తన కవితా పఠనం మాధుర్య భరితంగా, వినసొంపుగా వుంటుంది. నలభై, యాభైల్లో ప్రాచుర్యంలో వున్న జానపద గీతాలు, పోరాటపు పాటలు పాడి వినిపించేది. ఈ మధ్య కాలంలో రసభరితమైన సుఖానుభూతిని పోగొట్టుకొన్నాము కాఫీహౌస్ గత ప్రాణులందరము.

"స్వాగతం! మహాకవి! స్వాగతం!" చటర్జీ కంఠాన్ని అనుసరించి పెద్ద పెట్టున చప్పట్లు వినవచ్చాయి కాఫీ హౌస్‌లో. ఐదు గంటల సాయం కాలం. ఎప్పటిలాగే ఆత్మను ఓవరాయిలింగ్ చేద్దామని కాఫీహౌస్‌కు వచ్చిన నాకు పండుగ కోలాహలం ఎదురైంది. హోటల్‌కు సెలవు యిచ్చి, ఆవరణలో చిన్న అభినందన సభ ఏర్పాటు చేశాడు చటర్జీ. "ఏమిటిది చటర్జీ! ఎందుకీ హడావుడి? ఈ దండలు, బొకేలు, అభినందన సభ వీటికి నేను అర్హుణ్ణి కాను. చిమ్మ చీకటిలో క్షణం పాటు తళుక్కుమనే మెరుపులివి. ఈపాటి మెరుపులకే పరవశించి పోతే మనం మన చుట్టూ వున్న చీకటిని మరిచిపోయినట్లే లెక్క!" చిరుకోపాన్ని వ్యక్తం చేస్తూ విసుక్కున్నాను.

"వద్దు! ఈ రోజు ఫిలాసఫీ వద్దు! నైరాశ్యం వద్దు! ఈ ఒక్క రోజు ఆనందంతో పొర్లిపోయే మధు పాత్రలమవుదాం!" అన్నాడు రామమోహన్ నా మాటలకు అభ్యంతర పెడుతూ. రామమోహన్ సీసలైన కవితా విమర్శకుడు. ఏ కవితనైనా దాని లేబుల్స్‌కి అతీతంగా చదివి ఆనందించగల ఆథర్-ఫ్రెండ్లీ కంప్యూటర్. విశ్వనాధన్‌గారు పనిచేసే కాలేజీలోనే లెక్చరర్. విశ్వనాథన్, రమణ, పార్వతీ శంకర్, మైథిలి, డాక్టర్ సరళ, కార్తీక్, పాంచజన్యం మొదలైన లిటరరీ కొలీగ్స్ అంతా అక్కడ సమావేశమైనారు.

"మై డియర్ ఫ్రెండ్స్! పాతికేళ్ళపాటు మన సాయంకాలాల్నీ, మన కబుర్లనీ, మన కాఫీగతమైన లౌకిక స్వప్నాలనూ పంచుకొన్న శ్రీనివాసరావు హఠాత్తుగా నేషనల్ ఫిగర్ అయ్యాడు. తెలుగు కవిత్వానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లేదనుకుంటున్న సమయానికి శ్రీనివాసరావు ఈ బహుమతి ద్వారా కవితాభిమానులకు ఆహ్లాదకరమైన విందు యిచ్చాడు. శ్రీనివాసరావు తాలూకు ఈ విజయానికి మన మందరమూ హృదయపూర్వకంగా గర్విస్తున్నాము".

"కవిత్వము, నాటకం, సంగీతం క్రమంగా ఫేడౌట్ అయిపోయి స్టాక్ మార్కెట్లు, షేర్లు, సోషల్ వ్యాక్యూమ్‌ని నింపుతోన్న కాలం యిది. మన జీవితం వస్తువులన్నీ పేర్చిన పెద్ద సూపర్ బజారు అయిపోయింది. ప్రతి అనుభూతినీ రూపాయి తోనే గుణించుకోవటం

అలవాటు చేసుకున్నాము. అనుభూతులు దాచుకోవాల్సిన గుండెల్లో ఇప్పుడు షేర్లనీ, డిబెంచర్లనీ దాచుకుంటున్నాము. ఇంతగా వ్యాపారీకరింపబడని కొద్ది మందికి మిగిలిన ఆత్మీయమైన స్పందన శ్రీనివాసరావు కవిత.

శ్రీనివాసరావు కవిత ఒక సంఘటన. పోరాటపు శక్తినీ, బాధలోని మెలాంకోలిక్ హాయిని విచిత్రంగా సమ్మిళితం చేసి పాఠకుణ్ణి కట్టివేసే మంత్రమహిమ ఆయన కవిత. కాఫీ హౌస్ సాహితీ మిత్రులందరము శ్రీనివాసరావుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాము"

విశ్వనాథన్ ఉపన్యాసంతో హాలంతా చప్పట్లతో మారుమోగింది. చటర్జీ దగ్గరుండి అందరికీ స్వీటు, కాఫీ సర్వ్ చేస్తున్నాడు. క్రమంగా వాతావరణంలో ఫెస్టివల్ మూడ్ వచ్చింది. నాలోని నిర్లిప్తత కరిగిపోయి ఉత్సాహపు హాయి రగులుకొంది. "శ్రీనివాసరావు రెండు మాటలు మాట్లాడు!" అంటూ విశ్వనాథన్ అభ్యర్థించాడు. అతని ఆహ్వానం చెవిని సోకే క్షణానికి హృదయం ఆర్ద్రతాగతిలో వుంది. మనసో సంగీత పరికరమై జ్ఞాపకాలు కమ్మని రాగాలుగా బయటకు వచ్చాయి.

"బాల్య యవ్వనాల కలల రహదార్లపై నడుచుకుంటూ వార్ధక్యపు స్తబ్ధతలోకి జారుకున్న నా అరవై ఏడేళ్ళ జీవితం నా కవితల్లో క్రమంగా కనిపిస్తున్న మార్పులకు సింబాలిక్‌గా వుంది. అప్పట్లో చేగువేరా నా ఆదర్శం. సైరామాస్త్రా, వియత్నాం నా రంగస్థలాలు. నెరూడా, ఫైజ్ అహమ్మద్, అక్టోవియా పాజ్, అరగాన్, నిజామ్‌హిక్‌మత్ నా ఆరాధ్య దేవతలు, గురుదేవ్, రామకింకర్ బైజ్, రిత్విక్ ఘటక్, కైఫీ ఆజ్మీ నా ప్రియతములు.

నా యిర్వై రెండో యేట నా మొదటి కవితా సకంలనం వెలువరించాను. 'ముక్తిపథం' దాని పేరు. ముప్పయి రెండు పేజీల సైక్లోస్టైల్డ్ పుస్తకం అది. రాత్రిపూట లాంతరు దీపం వెలుగులో అక్షరం అక్షరంలో తన అనురాగాన్ని కూరి అమ్మరాసి పెట్టిన రాతప్రతి అది. మొత్తం వందకాపీలు తీయించాము. అవి క్విట్ ఇండియా ఉద్యమపు రోజులు. మూడు రంగుల కాంగ్రెసు పతాకపు ఇంద్ర జాలంలో పల్లెలు, పట్టణాలు కొట్టుకుపోతున్న కాలమది. సరస్వతీ గ్రంథాలయం దగ్గర పుస్తక ఆవిష్కరణ జరిగింది. నరసింహారావు అనే వృద్ధ కాంగ్రెసు నాయకుడు ముఖ్య అతిథిగా వచ్చాడు. "శ్రీనివాసరావు కవిత్వంలో కాస్త ఉద్రేకం పాలు ఎక్కువగా వుంది. యువకులు కదా, ఆపాటి ఉద్రేకం తప్పని సరి. కానీ మనం ఎల్లప్పుడు మహాత్మాగాంధీ ఆజ్ఞల్ని శిరోధార్యంగా వుంచుకోవాలి. బ్రహ్మాండమైన బ్రిటిషు ఎంపైర్. అగ్నిగోళం లాంటిది. విప్లవం, హింస అంటూ ఉద్రేక పడితే మంటల్లో పడ్డ పురుగుల్లా మలమలమాడి పోతారు. భగత్‌సింగ్ ఏమైనాడు? అజాద్ ఏమైనాడు? అందుచేత యువకులంతా ఓర్పు వహించాలి. ఈ కవి నాకు బాల్యం నుంచీ తెలుసు. ఈయన తండ్రి గొప్ప ఆదర్శవాది. తల్లి సాక్షాత్తూ భారతమాతే. అలాంటి ఆదర్శ దంపతులకు పుట్టిన కొడుకు. ఇందులోని కవితలన్నీ బాగున్నాయి. అయితే అంతా వచన కవిత్వం. దేశీయంగా వ్యావహారిక భాషలో సాగింది. పద్యకవితల్నీ, ఛందస్సునీ నిరసించటము అదో ఫ్యాషన్ ఈ రోజుల్లో. ఇదీ మంచిదే. ప్రజల్లోకి బాగా దగ్గరగా వెళుతుంది. నా మనసు

కనిపిస్తుంది ఈ కుర్రవాడు తెలుగు కవిత్వానికి మరపురాని సేవచేసి, ఆ చంద్రార్కము మిగిలిపోయే యశస్సును గడిస్తాడని."

చాలా చప్పగా సాగింది ఆయన ఉపన్యాసం. అమ్మ బలవంతం చేత ఆయన్ను పిలవాల్సి వచ్చింది. భగత్‌సింగ్ గురించిన ఆయన వ్యాఖ్యానాలు కుర్రవాళ్ళందర్నీ బాధపెట్టాయి. ఆ మీటింగ్‌లోనే మైత్రేయ పరిచయమయ్యాడు.

"మీ కవితల్లో గొప్ప ఉద్వేగం వుంది. మనిషిలోని నిద్రను తరిమి వేసే చైతన్యం వుంది. సోవియట్ రష్యాలో పరిణామాల్ని అధ్యయనం చెయ్యండి. మీ కవితల్లో మీరు కలలుకంటున్న కొత్త ప్రపంచము అక్కడ ఏర్పడనుంది. అక్కడి ప్రజల పోరాటాలు మనకు ఆదర్శం కావాలి. ఆదివారం, సాయంకాలం బ్రాడీపేటలోని మా యింటికిరండి. మీలాంటి చైతన్యమూర్తులు మరి కొంతమందిని కలుద్దురుగాని" అంటూ ఇంటికి ఆహ్వానించాడు.

మైత్రేయతో పరిచయం ఒక గొప్ప మలుపు నా జీవితంలో. గాంధీ, ఖద్దరు, హరిజన సేవమొదలైన వెజిటేరియన్‌స్వప్నాలన్నీ క్రమంగా మార్క్స్, లెనిన్, ఎం.ఎన్.రాయ్ వర్గదృక్పథం లాంటి జ్వాలా గీతాలుగా రూపాంతరం చెందాయి. అప్పటికే జనతంత్ర పార్టీ ఏర్పడింది. బొంబాయి, కలకత్తా వంటి నగరాల్లో కొన్ని ముఖ్యమైన విజయాల్ని సాధించింది. ఆ వార్తలన్నీ మాకు యుద్ధరంగం నుంచి వినపడే కాహళ ధ్వనుల్లా వుండేవి. త్రివర్ణ పతాకం, ఖద్దరు స్థానంలో ఎర్రజెండా నా ఆవేశాలకు ప్రతీక అయ్యింది. నా ఆలోచనల్లోని ఈ మార్పును మొదటగా కనిపెట్టింది అమ్మే. "మార్గమేదయినా అందరూ పోరాడేది మాతృదేశం కోసమే కదా! ఆలోచనతీరు, నడిచేబాట ఏదైనా నా కభ్యంతరము లేదు. అది బ్రిటీషువాడికి వ్యతిరేకంగా సాగే ఉద్యమం అయితే చాలు!" అంటూ గ్రీన్‌సిగ్నల్ యిచ్చింది.

ప్రజా రచయితల సంఘం ఒకటి వుందని అందులో నాలాంటి కవిమిత్రులు దీపశిఖల్లాంటి కవితల్ని వెలయిస్తున్నారని మైత్రేయ చెప్పాడు. అంతవరకు 'గుంటూరు వాణి', 'జై ఆంధ్ర', 'ఆంధ్రపతాక' లాంటి స్థానిక పత్రికల్లో నా కవిత్వం ప్రచురింపబడేది. మైత్రేయ ప్రోత్సాహంతో మొదటిసారి నా కవితల్ని 'నవ్యకవిత', 'ఉదయిని', 'భారతి' లాంటి పత్రికలకు పంపాను. పాఠకుల నుండి అనూహ్యమైన ప్రతి స్పందన వచ్చింది. ప్రజా రచయితల సంఘం అధ్యక్షుడు స్వయంగా ఉత్తరం వ్రాశాడు. విప్లవాశీస్సులతో మొదలు పెట్టి కాకినాడ వార్షికోత్సవ సభకు రావలసిందిగా ఆహ్వానించాడు. ఆ సంవత్సరం ప్రజా రచయితల సంఘానికి ఉపకార్యదర్శిగా ఎన్నుకొన్నారు నన్ను.

పందొమ్మిది వందల నలభై మూడు ఆగస్టులో దేశ ద్రోహం నేరం క్రింద మైత్రేయ అరెస్టు అయ్యాడు. మైత్రేయ అరెస్టును ఖండిస్తూ అన్ని ముఖ్యమైన దినపత్రికలకూ నిరసన వార్తలను పంపాము. ఊరంతా పోస్టర్లను అంటించాము. కళ్యాణరావు, వీరభద్రుడు, రామన్- నేనూ ముందుండి దాదాపు ముప్పయి మందితో ఊరేగింపు ఏర్పాటు చేశాము. ఎర్రజెండా ముందుండగా ఊరేగింపు జరగటం గుంటూరులో అదే ప్రథమం. జనంలో గొప్ప సంచలనం తెచ్చిందా ఊరేగింపు. ఊరేగింపు కలెక్టరు ఆఫీసుదాక సాగాలని మా ప్లాన్.

కలెక్టరుకో మెమోరాండం తయారు చేశాము. సరస్వతీ గ్రంథాలయం మలుపుదగ్గర మా ఊరేగింపు ఆగిపోయింది. ఊరేగింపును చీల్చుకుంటూ పోలీసువ్యాను మా మధ్యకు వచ్చింది. ఉగ్రజాగిలాల్లా మాపై విరుచుకుపడ్డారు పోలీసులు. తలపై 'ఫట్' మన్న లాఠీ కర్ర, నుదిటిపై చిమ్మిన రక్తపు ధార నాకింకా గుర్తు. రోడ్డుపై ఈడ్చుకుంటూ వ్యాన్‌లో పడవేశారు. అంతటి హింసాకాండలోనూ మేమింకా మైత్రేయకోసం, ఎర్రజెండా కోసం నినాదాలు చేస్తూనే వున్నాము. కుట్ర కేసును మాపై బనాయించారు పోలీసులు. పందొమ్మిది వందల నలభై నాలుగు ఆగస్టు వరకూ జైల్లోనే గడిపాను.

జైలులో ఉన్నప్పుడే సుధ పరిచయమైంది. సుధ రామన్ చెల్లెలు. ఎఫ్.ఎ. వరకూ చదివింది. గొప్ప కాంగ్రెస్ అభిమాని. సుధతో పరిచయం కాకముందు ప్రేమ ఒట్టి అభౌతిక వాదమని, అదో బూటకమని వాదించే వాణ్ణి. కానీ చూస్తుండగానే సుధ నా ఆంతరంగిక ప్రపంచంలోకి చొరబడి అంతటా తానైంది. సుధతో దాస్ కేపిటల్ గురించి, ఎం.ఎన్.రాయ్ రచనల గురించి గంటల తరబడి వాదించేవాణ్ణి. గాంధేయవాది అయిన సుధకు నా అభిప్రాయాలు గిట్టేవికావు. గాంధీ కారణ జన్ముడని, భగవత్ స్వరూపుడని తన నమ్మకం. భారతదేశానికి స్వరాజ్యం అంటూ వస్తే అది గాంధీ ద్వారానే వస్తుందని వాదించేది.

మద్రాసు నుండి వెలువడే 'భైరవి' వారపత్రికలో ఇరవై వారాలపాటు నా కవితలు వెలువడ్డాయి. 'జైల్లో భగ్గుమన్న అగ్నికణం', 'కటకటాల మధ్య హోరెత్తిన సముద్రం' గొప్ప పబ్లిసిటీ యిచ్చాడా ఎడిటర్. చూస్తుండగానే నా పలుకుబడి పెరిగిందని, కొంతమంది సాహితీ అభిమానులు నా విడుదలకై అర్జీలు పెట్టారని చెప్పింది సుధ. కొంచెం గర్వం, కించిత్ ఆనందం కలిగాయి.

జైలు నుంచి విడుదలైన నెల రోజుల్లోనే నాకూ సుధకూ పెళ్ళి జరిగింది. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతమైనది మా పెళ్ళి. అమ్మ హృదయపూర్వకంగా ఆశీర్వదించింది. కమ్మని వసంతవాయులహరిలా నన్ను చుట్టుముట్టింది సుధ ప్రేమ పరిమళం.

నలభై ఐదులో జనతంత్ర పార్టీ సభ్యుడిగా చేరాను. ఆరు నెలలు తిరక్కుండానే సుధ కూడా పార్టీ సభ్యురాలైంది. అంతటి కాంగ్రెస్ భక్తి, గాంధీ ప్రేమ నేపథ్యంతో ఎలా ఆ పార్టీ సభ్యురాలయిందో నాకిప్పటికీ ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. "మీ వివేచనపై నా, ఆలోచనపై నా నాకెంతో నమ్మకం. ఆ నమ్మకంతోనే ఆ పార్టీలో చేరాను. రోజులు గడిచిన కొద్దీ ఆ పార్టీ ఆశయాలు నన్ను ముగ్ధురాల్ని చేశాయి" అంటూ తన నిర్ణయాన్ని సమర్థించుకొంది.

నలభై యేడులో స్వాతంత్ర్యం వచ్చింది. నూడో యుఫోరియాలో ఒకటి రెండేళ్ళు గడిపాము. నెహ్రూ మార్కు సోషలిజం గురించి మేమిద్దరం కొంతకాలంపాటు భ్రమలో ఉన్నాము. మొదటి సార్వత్రిక ఎన్నికలు వచ్చేనాటికి మా భ్రమలూ తొలిగిపోయాయి. జెండా రంగులు, నాయకుల చర్మపు రంగులలో మార్పు మినహా పాలనా వ్యవస్థలో ఏం మార్పు లేదని అర్థమైంది. ఆ ఎన్నికల్లో జనతంత్ర పార్టీ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం అనుకున్నారు. ఎన్నికల్లో నెగ్గి అధికారంలోకి వస్తుందనే అందరం

కలలుకన్నాము.

ఆ ఎన్నికల కోసం ఎన్నో గేయాలు వ్రాశాను. సుధ, నేను వందలాది మీటింగులలో మా పాటలతో, గేయాలతో జనాన్ని ఉత్తేజితుల్ని చేశాము. అదో పిచ్చిలా మారింది. తిండి, తిప్పలు మాని వందలకొద్దీ మైళ్ళు తిరిగాము. ఆ హడావుడిలో ఉండగానే సుధ రెండు రోజులు ఇంటికి వెళ్ళి వస్తానని వెళ్ళింది. అప్పటికి ఎన్నికలు సరిగ్గా వారం రోజులే ఉన్నాయి. పార్టీ నాయకులు విసుక్కున్నారు. సుధది మంచి గాత్ర శుద్ధికల కంఠం. సభల్లో ఆమె పాటలే ప్రత్యేక ఆకర్షణ. ఆ రెండు రోజులూ ఎక్కడికి వెళ్ళిందీ రహస్యంగా వుంచింది చాలాయేళ్ళపాటు. సుధ అప్పటికి మూడు నెలల గర్భవతి అట. ప్రచార కార్యక్రమాలకు అవరోధంగా ఉంటుందని, తెలిసిన లేడీ డాక్టర్ దగ్గర గర్భవిచ్ఛిత్తి చేయించుకొందట!

ఎన్నికలలో భంగపాటు మా ఉత్సాహాన్నే మాత్రం నీరుగార్చలేక పోయింది. ఆ తరువాత రెండు యేళ్ళలోనే నా 'ఝుంఝుం', 'వివేచన' కవితా సంకలనాలు వెలువడ్డాయి. ఈసారి సంకలనాల ప్రచురణ బాధ్యత పార్టీనే చేపట్టింది.

పార్టీ నాలాగే కొన్ని వందల మంది కవులకు, కళాకారులకు అభయధామం అయింది. ఏ ఉద్యమం వచ్చినా కళాకారులే అగ్ర భాగాన ఉండేవాళ్ళు. ఆంధ్రరాష్ట్రం కావాలంటూ రాష్ట్రమంతా నినదిస్తున్న రోజులివి. 'విశాలాంధ్ర విలాపం' అంటూ బెజవాడ వీధుల్లో వీధి నాటకాన్ని ప్రదర్శిస్తున్నాము. పొట్టి శ్రీరాములు మరణ వార్త దావానలంలా వ్యాపించింది. వీధులన్నీ హింసా గీతాలయినాయి. పోలీసులు మమ్మల్ని బలవంతంగా లాక్కువెళ్ళి వాన్లలో వేశారు. పశువుల్ని దొడ్లలో వేసినట్టుగా మమ్మల్ని జైళ్ళలో కుక్కారు. రెండు రోజులపాటు తిండి, నీళ్ళు లేవు. జైల్లోనే సుధకు రెండోసారి అబార్షన్ అయింది. కన్నీరు కార్చడానికి, కారే కన్నీటిని తుడిచి గుండెలకు హత్తుకొని ఓదార్చడానికి కూడా ఓపికలేని పరిస్థితి అది.

ఆంధ్రరాష్ట్రం వచ్చినాక హఠాత్తుగా ఏదో ఖాళీతనం మాపైన ఊడిపడింది.ఏమి చెయ్యడానికీ పాలుపోని పరిస్థితి. ఆ తరువాత ఆరేళ్ళు కవిగా బద్ధకించాను. సృజనాత్మకమైన రచన ఏదీ చెయ్యలేదు. "నిద్ర బొరియలో మహాకవి హైబర్‌నేషన్" అంటూ వ్యాసం ఒకటి ప్రజాంధ్రలో ప్రచురింప బడి నన్ను ఉలిక్కిపడేలా చేసింది. వారం రోజులు తిరక్కుండానే "ఉద్యమ నాయకుడికి మేలుకొలుపు" అంటూ కవిత ప్రచురింపబడింది. నా స్తబ్దతపై బలంగా మోదిన కొరడా దెబ్బల్లా ఆ రెండు రచనలూ నన్ను మళ్ళీ జాగృతిలోకి తెచ్చాయి. చాలా రోజుల తరువాత తెలిసింది. ఆ అజ్ఞాత రచయిత్రి సుధేనని.

ఆ రోజుల్లోనే ప్రకాష్ పుట్టాడు. జనతంత్ర పార్టీ నాకు జీవన భృతిగా నెలకు మూడొందలు పంపుతామని కబురు చేశారు. సుధ వద్దంటూ తిరస్కరించింది. "జవసత్వాలున్నాయి కదా! వికలాంగులకో, వృద్ధులకో ఇచ్చినట్టు మనకూ పించనా, వద్దు!" అంటూ పట్టుపట్టింది. ప్రబోధ ప్రింటింగ్ ప్రెస్‌లో ఉద్యోగానికి చేరాను. పేరుకు మేనేజరు ఉద్యోగమైన ప్రూఫ్ రీడింగ్ నుంచి ప్రింటింగ్‌దాక అన్నీ నేనే చెయ్యాల్సి వచ్చింది.

ఈ రోజుల్లోనే దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాము. నూట యాభై రూపాయల జీతంతో ఎంతగా సర్దుకున్నా ఏదో ఒక అవసరం ఎదురై డబ్బుకోసం వెతుకులాట అయ్యేది. పత్రికల వాళ్ళ రెమ్యునరేషన్ బహుస్వల్పం. తీరని స్వప్నాలెన్నో గుబులు రేపేవి. ప్రపంచమంతా కొత్త కవితా రీతుల్తో పోటెత్తుతున్న రోజులవి. ఇంగ్లీషులో కొత్తగా వస్తున్న కవితా రీతుల్ని చదవాలనే కోరిక. పెంగ్విన్ వాళ్ళు నెరూడా కవితా సంకలనాన్ని వెలువరించారు. బుక్‌స్టాల్ వైపు వెళ్ళినప్పుడల్లా ఆ పుస్తకం పారేసుకున్న స్వప్నంలా నన్ను బాధపెడుతూనే వుండేది. ఒక సాయంత్రం ప్రెస్ నుండి తిరిగి వస్తుండగా సిటీ లైబ్రరీలోంచి 'జముకుల కథ' వినిపించి, తెలిసిన కంఠంలా తోచి లోపలికి వెళితే, అక్కడ సుధ. 'యాభై రూపాయలిస్తామన్నారు. మీకో మంచి పుస్తకం కొనిపెట్టవచ్చని' అంటూ సుధ సంజాయిషీ యిస్తుంటే కళ్ళు, గుండెలు ఏకకాలంలో చెమర్చాయి.

మిత్రులారా! నలభై యేళ్ళ కవితా జీవితం నాది. దేన్ని స్వప్నించానో దాన్నే కవితలుగా వ్రాశాను. ఏ ఆదర్శాన్ని నా కవితల్లో నినదించానో దాన్ని జీవితంలో కూడ ప్రతిఫలించుకోడానికి పెనుగులాడేను. నేనో గొప్ప కవినని ఏనాడూ విర్రవీగలేదు. కవిత్వమొక అగాధ జలనిధి. జీవితమంతా శ్రమిస్తే ఒకటో రెండో ముత్యాలు చేతికి చిక్కుతాయి. అదే గొప్పభాగ్యం. నిజానికి కవిగా నేను ఎంతో ఎదగాల్సి వుంది. ఎంతో అధ్యయనం చెయ్యాల్సి వుంది. పార్టీ కార్యక్రమాలయితేనేం. పేదరికమైతేనేం, వ్యక్తిగత విషాదాలయితేనేం, ఆ అధ్యయనాన్ని నేను పోగొట్టుకొన్నాను. ఇది జీవితపు సంధ్యా సమయం. మరింక ఓపిక, వ్యవధి లేవు. నా కవితల్లో కలలు కన్న సమతా స్వప్నం మరింక నా జీవితకాలంలో నెరవేరు తుందనే ఆశలేదు. కేపిటలిజం అనే ఘోర విపత్తు నుండి ఈ ప్రపంచం మరింక కోలుకోదేమోనని సందేహంగా వుంది. కానీ ఒక మధుర స్వప్నం మాత్రం హమేషా నా కళ్ళలో నిలిచి వుంటుంది. మనం నడచిన ఈ నేలంతా పోరాటపు విత్తనాలను మొలకెత్తే నిండు చూలాలయి, ఈ వారసత్వాన్ని రేపటికందిస్తుందని.

థాంక్యూ ఫ్రెండ్స్! గుండెను కెలుక్కొని, నాలుగు జ్ఞాపకాలను వెలికి తీసుకోగలిగే అవకాశ మిచ్చారు. నా కవితా శిశువుకు పోషకాహారాల్లాంటి మిత్రులు మీరు. మీ స్నేహానికి, అనురాగానికి, మీతో పంచుకున్న సాయంకాలాలకు నన్ను కృతజ్ఞతలు చెప్పనివ్వండి!"

నా ఉపన్యాసం ముగించాను. ఎవరూ చప్పట్లు కొట్టలేదు. చప్పట్లు కొట్టబోయిన ఒకరిద్దరిని విశ్వనాథన్ ఆపివేశాడు. "చప్పట్లు కొట్టి ఆమోదాన్ని తెలియజేయడానికి ఇది బహిరంగ సభ కాదు. హృదయానుభూతుల్ని పంచుకొన్న స్నేహసంగమం. ఇవాళ సాయంకాలం మనకెప్పటికీ గుర్తు వుంటుంది. శ్రీనివాసరావు, సుధ ఇద్దరు స్నేహితులుగా కవులుగా మనకు తెలుసు. వాళ్ళ జీవితంలోని నిబద్ధతను, మానవీయతను మొదటిసారిగా తెలుసుకున్నాము. వాళ్ళకు సమకాలీనులం, సహచరులం అయినందుకు మనమెంతో గర్విస్తాం! ఈ మధురానుభూతులను అందించినందుకు థాంక్యూ శ్రీనివాసరావు అండ్ థాంక్యూ సుధ!"

విశ్వనాథన్‌గారి మాటలు ముగియకుండానే పాతికేళ్ళ యువకుడు "నన్ను

మాట్లాడనివ్వండి!" అంటూ లేచి నిల్చున్నాడు. "నా పేరు మోహనరెడ్డి. ప్రజాబంధులో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాను. ఈవారం ప్రజాతంత్రలో 'హిమాలయాల ఎత్తుల నుండి మురికి కాలువల లోతుల్లోకి ప్రయాణిస్తున్న శ్రీనివాసరావు' అనే వ్యాసం వ్రాసింది నేనే. సారీ సర్స్! మీకు కోపం వచ్చినా సరే, నేను మాట్లాడి తీరుతాను. శ్రీనివాసరావు అభిమానిగా ఈ నాలుగు మాటలు నేను చెప్పితీరాలి.

శ్రీనివాసరావు కవిగా చనిపోయి చాలాకాలమయింది. చౌకబారు చెత్తను వ్యాసాలుగా, నవలలుగా ఆంధ్రదేశంపైకి వదుల్తున్నాడు. శ్రీనివాసరావు రచనల్లో క్రమంగా వ్యాపార సాహిత్యపు వైరస్‌లు ప్రవేశించడం, చరిత్ర మన మీద ప్రదర్శించిన గొప్ప ప్రాక్టికల్ జోకు. ఇప్పుడీ జ్ఞానపీఠం అవార్డు! దీన్ని ఒప్పుకోవటం అంటే శ్రీనివాసరావు తనలోని ప్రజాకవిని తానే హతమార్చుకోవటం. సభాముఖంగా ఈ అవార్డును తిరస్కరించమని మహాకవి శ్రీనివాసరావును అభ్యర్థిస్తున్నాను. వందలాది ఆయన అభిమానుల తరపున చేస్తున్న విన్నపమిది!" ఆ నాలుగు మాటలు చెప్పి మోహనరెడ్డి చరచరా అక్కడ నుండి వెళ్ళిపోయాడు.

ఎవరూ కొద్ది నిముషాలపాటు మాట్లాడలేక పోయారు. "ఇలాంటి ఆషాఢభూతుల మాటల్ని సీరియస్‌గా తీసుకోకండి" అంటూ భుజం తట్టాడు విశ్వనాథన్. గూళ్ళు చేరవలసిన పక్షుల్లా అందరమూ బయటకు నడిచాము.

ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిదయింది. చిక్కటి చీకటి. మోహన్‌రెడ్డి మాటలతో మనసంతా గ్లూమీగా అయిపోయింది. కవిగా మరణించటమంటే ఏమిటి? కవిత్వపు వైచిత్రిని, ప్రతిభను పోగొట్టుకోవటమా? లేక నిబద్ధతని అతిక్రమించటమా? అలా అయితే ప్రతిభకు కొలమానమేమిటి? నిబద్ధతను నిర్ణయించే దెవరు?

ఇంట్లో సందడిగా వుంది. పది మంది యువతీ యువకులతో కలసి కబుర్లనీ, కాఫీనీ పంచుకొంటుంది సుధ. "నమస్తే మాష్టారూ!" సాహితి. సాహితి ప్రకాష్‌కు మంచి స్నేహితురాలు. తను కూడా మెడికో. ప్రస్తుతం ఎం.డి. చేస్తూంది. 'ప్రోగ్రసివ్ ఫోరమ్' అనే సంస్థకు సెక్రటరీ. "మీతో పోట్లాడటానికి వచ్చాము" అంది. 'వృద్ధులము, అర్భకులము మాతోనా పోట్లాట?" నవ్వుతూ వాళ్ళ ఎదురుగా కూర్చున్నాను.

"మీకు అవార్డు వచ్చిందని పేపర్లో చూశాను. మీకు శుభాకాంక్షలు చెప్పడానికి మేము రాలేదు. మిమ్మల్ని ఒప్పించి మీ చేత ఈ అవార్డును తిరస్కరింప జేయాలని వచ్చాము. ఈ అవార్డు మీ నలభై యేళ్ళ సాహితీ జీవితంపై పెద్ద ఎసాల్టు! కవిగా మీరు ప్రజలతో, ఎన్నో ఉద్యమాలతో మమేకమైనారు. మిమ్మల్ని మేము ప్రజాకవి అనీ, మహాకవి అనీ ప్రేమగా గౌరవించుకున్నాము. అరుదైన ఈ గుర్తింపును మీ నుండి తస్కరించడమే ఈ అవార్డు లక్ష్యం. అదలా వుంచి, ప్రకాష్ మరణపు కన్నీటి తడి ఇంకా ఆరలేదు. ప్రోగ్రసివ్ ఫోరమ్ తరపున మీ వెనుక మేము నిలిచి చేసిన ఉద్యమపు వేడి ఇంకా చల్లారలేదు. మూడేళ్ళు పెద్ద వ్యవధికాదు. మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాము. ఈ అవార్డును తిరస్కరిస్తూ స్టేట్‌మెంట్ ఇవ్వండి!" చాలా ఉద్వేగంగా ఆవేశంగా చెప్పింది.

"సాహితీ! నీ ఆవేశాన్ని నేను అర్థం చేసుకోగలను. రెండు మూడు రోజుల వ్యవధి నివ్వు. ఆలోచించి నా నిర్ణయం చెబుతాను" అన్నాను. సందేహంగా నావైపు చూసింది. "నిన్ను నిరుత్సాహ పరచనులే!" అంటూ చిరునవ్వుతో భుజం తట్టాను. "సెలవు" అంటూ వాళ్ళు బయలు దేరారు. సుధ ముఖంలో దిగులు మేఘాలు వెలిసాయి. రోదించే మానవాత్మ ఏదో తనను ఆవేశించినట్టుగా అశ్రుగీతం అయింది.

మూడేళ్ళ క్రితం సెప్టెంబరు పదమూడు ఆ రోజు. ఉదయం వేళ కొంతమంది మెడికల్ విద్యార్థులు పాలిపోయిన ముఖాలతో మా యింటికొచ్చారు. ప్రకాష్ ఆత్మహత్య చేసుకొన్నాడని వార్తను తెలియజేశారు. కాలేజీ కాంపస్‌లోనే లైబ్రరీ దగ్గర చెట్టుకు ఉరి వేసుకుని చనిపోయాడని చెప్పారు. ఆ వార్తను జీర్ణం చేసుకోడానికి చాలా సమయం పట్టింది నాకు. ఎంత బింకంగా ఉండాలన్నా సాధ్యంకాలేదు. జీవితపు సంధ్యా కాలంలో కలలన్నీ వాడిపోయిన వార్ధక్యపు మోడుకు మిగిలిన ఒకే ఒక ఆశాలత కళ్ళముందే రాలిపోవటం ఊహించని విషాదం. బరువెక్కిన గుండెలతో పొగిలి పొగిలి ఏడ్చే సుధను ఓదార్చుతూ కాలేజీకి వెళ్ళాము.

అప్పటికే శవాన్ని చెట్టుపై నుండి దించారు. కాలేజీ విద్యార్థులకు ప్రొఫెసర్లకు ఇది ఊహించని షాక్. పోలీసులు ఆపాటికే రంగప్రవేశం చేసి అవసరమైన ఫార్మాలిటీస్ పూర్తి చేస్తున్నారు. పోస్ట్‌మార్టం కోసం హాస్పటల్‌కు తరలించమని హడావుడి చేస్తున్నారు. ప్రిన్సిపాల్ ఖిన్నవదనంతో ఓదార్పునందించాడు. "ఎంతో తెలివైనవాడు, ఎ రేర్ జమ్ అంటూ క్లాసుల్లో అతన్ని అభినందిస్తుంటాను. అతని జీవితం ఇలా ముగుస్తుందని అనుకోలేదు. ముసలితనంలో ఇదో తట్టుకోలేని దెబ్బ మీకు. అయినా ధైర్యంగా ఉండాలి!"

ప్రిన్సిపాల్ మాట పూర్తి కాకుండానే క్యాంపస్ హఠాత్తుగా శబ్ద సముద్రమైంది. పెద్ద పెట్టున నినాదాలతో ఊరేగింపు ఒకటి లోపలికి వచ్చింది. ఊరేగింపు ముందున ప్రకాష్ స్నేహితులు సాహితి, రమ, రఘు ఉన్నారు.

"ప్రకాష్ అమర్ రహే!" "ఇది ఆత్మహత్య కాదు, ముమ్మాటికీ హత్యే!"

"హంతకులను శిక్షించాలి! వెంటనే విచారణ జరగాలి!" "ఉద్యమాలపై ప్రభుత్వపు దమన నీతిని ఖండించండి!" నినాదాలు విని అందరం ఉలిక్కిపడ్డాం. ప్రిన్సిపాల్ కూడా క్షణకాలంపాటు షాకయి ఊరేగింపు దగ్గరకు వెళ్ళాడు. "వాట్ డుయూ మీన్ బై దిస్?" అన్నాడు. ప్రకాష్ ప్రోగ్రెసివ్ ఫోరమ్ సెక్రటరీ. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడే యువతీ యువకుల సమూహం ప్రోగ్రెసివ్ ఫోరమ్. పోరాటం తప్ప వెన్ను చూపటం తెలియని ధీశాలి ప్రకాష్. ఇది ముమ్మాటికీ హత్యే. ప్రోగ్రెసివ్ ఫోరమ్‌పై బిగించిన ఉక్కు పిడికిలే దీనికి బాధ్యత వహించాలి. ఆత్మహత్యగా భ్రమింపజేయాలని వాళ్ళ ఎత్తుగడ. ఈ హత్యపై విచారణ జరిగి తీరాలి" సాహితి మాటలతో క్యాంపస్‌లో అలజడి మొదలైంది.

"మీ సందేహం నిజమైతే మీ ఉద్యమానికి నా మద్దత్తు కూడా ఉంటుంది. ముందు పోస్ట్‌మార్టమ్ జరగనివ్వండి. పోస్ట్‌మార్టమ్‌లో నిజానిజాలు తేలుతాయి. పోస్ట్‌మార్టమ్ నేనే దగ్గరుండి జరిపిస్తాను." ప్రిన్స్‌పాల్ డా.రెడ్డి ఫోరెన్సిక్ ప్రొఫెసర్ కూడా."

పోస్ట్‌మార్టమ్‌లో గుండెలు పిండివేసే నిజం బయటపడింది. శరీరం నిండా కముకు దెబ్బలు. అది బలవన్మరణమై వుండవచ్చునని రిపోర్టు.

గుండెలలో వేదన, కోపం, ఆక్రోశం మిళితమైన జ్వాల. వేయి వసంతాలు వికసించాల్సిన పూలతోటను సమూలంగా నాశనం చేసిన వ్యక్తులో, శక్తులో, వాళ్ళు ఎంతటి కిరాతకులు. వాళ్ళెంతటి వాళ్ళైనా శిక్షింపబడాల్సిందే.

జిల్లా పోలీస్ అధికార్ని, కలెక్టర్‌ను కలిశాను. "ఇన్‌వెస్టిగేట్ చేస్తాము. నిశ్చింతగా వుండండి!" అంటూ ఓదార్చి పంపారు. రెండు వారాలైనా కదలిక లేదు.

పార్టీ నాయకుల్ని కలిశాను. "ఇ.సి.లో పెట్టాలి. రిజల్యూషన్ పాస్ చెయ్యాలి. అయినా ఇలాంటి ట్రుమ్రీ ట్రుమ్రీ గొడవలు ఒక జాతీయ పార్టీ తీసుకోవడం పార్టీ ఇమేజికి మంచిది కాదు. హోం మినిస్టర్‌తో మాట్లాడి చూస్తాం!" అంటూ కంటి తుడుపు మాటలు చెప్పి పంపారు.

అదిగో అప్పుడు ఈ ప్రోగసిస్ ఫోరం పిల్లలు నా వెనుక ఆర్మీలాగా నిలబడి "ఈ అర్జీలు, విజ్ఞాపనలను నమ్ముకుంటే పనులు కావు సార్! ప్రజలకు నిజానిజాలు తెలియజేద్దాం! వాళ్ళతోటే ఉద్యమాన్ని నిర్మిద్దాం!" అంటూ నాకు ధైర్యం చెప్పారు.

కాలేజీలు, స్కూళ్ళు బంద్ చేయించారు. "మహాకవి న్యాయ పోరాటంలో చేయూతనివ్వండి!" అంటూ కరపత్రాలు రాసి ఊరంతా పంచిపెట్టారు. వాడ వాడలా బహిరంగ సభలు. ఊరంతా ఉద్యమపు వేడిలో కొలిమిలా భగ్గుమంది. అసెంబ్లీలో చర్చ దాకా వెళ్ళింది. 'ప్రకాష్ తీవ్రవాద సంస్థలో సభ్యుడని, పార్టీ క్రమశిక్షణ చర్య తీసుకుని బహిష్కరిస్తే, ఆ అవమానం తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడ'ని హోంమంత్రి ప్రకటన చేశాడు. చివరి ఆయుధంగా ఆమరణ నిరాహార దీక్షను చేపట్టాను. రాష్ట్రమంతా సంచలనం రేగింది. పౌరహక్కుల సంఘాల వాళ్ళు కూడా ప్రభుత్వంపై వత్తిడి తెచ్చారు. చివరకు నిరాహారదీక్ష పదవరోజున జస్టిస్ కేశవరావు అనే హైకోర్టు జడ్జితో ఒక ఏకసభ్య విచారణ సంఘాన్ని నియమించారు. కమీషన్ ఏర్పడింది. చాలా నెలలపాటు విచారణ జరిగింది. దాదాపు మూడేళ్ళు కావస్తున్నా ఇంకా కమీషన్ రిపోర్టు లోకాన్ని చూడలేదు.

## 3

"సాహిత్య అకాడమీ భవన్‌లో ఆదివారం సాయంత్రం మీ గౌరవార్థం ఒక విందు ఏర్పాటు చేస్తున్నాము. ప్రముఖ కవులు, కళాకారులే కాక విద్యాశాఖా మంత్రి కూడా వస్తున్నారు. మీరు తప్పక రావాలి" అంటూ అకాడమీ సెక్రటరీ కబురు చేశాడు. అకాడమీలో ఇది నా తొలి ఎన్‌కౌంటర్. వెళ్దామా, వద్దా అంటూ తర్కించి వెళ్ళటం వల్ల కలిగే నష్టమేమీ లేదు కదా అని తోచి, అకాడమీల అంతరంగంలోకి తొంగి చూసే అవకాశం ఇది అనిపించి వెళ్ళడానికే నిర్ణయించుకున్నాను.

ఖద్దరు పంచె, లాల్చీ, పైన శాలువా, కవుల కుద్దేశించిన యూనిఫారమ్‌లో తయారయినాను. తలపై వెండి తీగల్లా మెరిసే జుట్టును వెనక్కు దువ్వాను. "కృష్ణశాస్త్రికి

నకిలీగా తయారయినారు. అకాడమీ చేరకమునుపే ఏ ఊర్వశో మిమ్మల్ని హైజాక్ చేస్తుంది. భద్రం!" ఓ జోక్ విసిరి చిరునవ్వుతో సాగనంపింది సుధ. "నువ్వూ రాకూడదూ!" సుధను అభ్యర్థించాను. "కవి పండితుల సొల్లును సానుభూతిగా వినగలిగే ఓపికను పోగొట్టుకున్నాను. నన్ను వదిలేద్దురూ!" సుధ మృదువుగా తిరస్కరించింది. "సాహితీ వీధుల్లో నలభై యేళ్ళపాటు కలిసి నడిచాము. సన్మానాలు, అవమానాలు కలిసి స్వీకరించాము. ఇప్పుడు ఒంటరిగా సభలకు వెళ్ళాలంటే ఇబ్బందిగా వుంది" బ్రతిమలాడాను. "ఒంటరితనంలోనూ ఒక సుఖం వుంది. మెల్ల మెల్లగా ఆ సుఖం కూడా అలవాటవుతుంది. వెళ్ళి రండి!" సుధ వీడ్కోలు చెప్పింది.

హైదరాబాదు చేరగానే అకాడమీ తాలుకు మనుషులమంటూ కొంతమంది స్టేషన్‌లో ఆహ్వానం పలికారు. స్టేషన్ బయట కారు ఒకటి సిద్ధం చేశారు. స్టార్ హోటల్లో వసతి. గౌరవాన్ని వ్యక్తం చేయడానికి కార్లు, స్టార్ హోటళ్ళ భాష తప్ప మరోలా ఈ అకాడమీలకు సాధ్యం కాదేమో అనిపించింది.

సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో అకాడమీ ప్రాంగణంలోకి చేర్చింది కారు. విద్యుత్ దీపాలతో అలంకరించారు భవనాన్ని. ఆవరణ నిండా కార్లు పార్కు చెయ్యబడి వున్నాయి. ఇది అకాడమీ వ్యక్తిగత వైభవానికి చిహ్నమా? లేక ఆంధ్ర కవుల సంపన్నతకు గుర్తా?

కళ్ళల్లో కృత్రిమమైన నవ్వులు, ముఖాల్లో అభిమానాన్ని, ప్రేమను చూపెట్టే అభినయాత్మకమైన వ్యక్తీకరణలు, సభ్యసాహితీ లోకమంతా నాకు కైమోడ్పు చేస్తుందేమోనన్న భ్రాంతిని కలిగించేటట్టు కవులందరూ ఒక్కసారిగా ఎదురు వచ్చి నన్ను స్వాగతించారు. ప్రభుత్వానికి ఆంతరంగిక కవిలాంటి వనమాలి నన్ను కౌగలించుకొని "ఎన్నాళ్ళకెన్నాళ్ళకు. మిమ్మల్ని కలుసుకోవడం అనే మధుర స్వప్నం ఇన్నాళ్ళకు ఫలించింది. వందలాది మీ అజ్ఞాత అభిమానుల్లో నేనూ ఒకణ్ణి. నా సాహితీ జీవితాన్ని మలుపు తిప్పిన మోహనాస్త్రం మీ కవిత" ఆశుకవిత్వమా అనిపించేటట్లుగా మాట్లాడడం ఆయన ప్రత్యేకత. వరుసగా కవి ప్రముఖులనందరినీ పరిచయం చేశాడు వనమాలి. అందరి నోళ్ళలోనూ పొగడ్తలే. ఒట్టి నిర్జీవ పదాల్ని నా ముఖంపై విసిరివేసే మొహమాటం అది. సుధ అన్న 'సొల్లు' ఇదే కాబోలు.

మంత్రి వర్యులు వచ్చివట్లున్నారు. అందరూ కాసేపు నన్ను వదిలి ఆయన చుట్టూ మూగారు. ఆయనకు నన్ను పరిచయం చేసే బాధ్యతను కూడా వనమాలే చేపట్టాడు. "మేమంతా మీ అభిమానులం శ్రీనివాసరావుగారూ! ఈ అవార్డు మీకు వచ్చినందుకు ఎంతో గర్విస్తున్నాం!" అంటూ ప్రేమ వర్షించే చూపులతో కరచాలనం చేశాడు మంత్రి.

"యువర్ అటెన్షన్ ప్లీజ్!" ఎత్తయిన వేదికలాంటి ప్రదేశంపై హాండ్ మైకులో ప్రత్యక్షమయ్యాడు వనమాలి.

"ఇవాళ అకాడమీ చరిత్రలోనే మరపురాని దినం. పోతన, వేమన లాంటి ప్రజా కవుల్ని ప్రేమపూర్వకంగా అకాడమీ గోడలపై చిత్రపటాలుగా నిలిపి ఆరాధించుకుంటున్నాము.

వారికి దీటైన మరో ప్రజా కవిని ఇప్పుడు మనం సన్మానించుకుంటున్నాము. ఇవాళ కష్ట జీవికి సైదోడు కాని కవిత్వం కవిత్వం కాదని అందరం అంగీకరిస్తున్నాం. తెలుగు కవిత్వంలో ఆ పరిణామాన్ని తెచ్చిన ఘనత శ్రీనివాసరావుదే. శ్రీనివాసరావుకు జ్ఞానపీఠం అవార్డు నివ్వడం ద్వారా 'ప్రజల కోసం వ్రాసేదే కవిత్వం' అని సాహితీ లోకమంతా బేషరతుగా ఒప్పుకోవడమే. తెలుగు సాహిత్యానికి తల్లి, తండ్రి, గార్డియన్ అయిన సాహిత్య అకాడమీ శ్రీనివాసరావును సవినయంగా సన్మానించుకుంటుంది. మంత్రివర్యులు మాన్యశ్రీ పి.వి. విజయరావుగారిని శాలువను, జ్ఞాపికను శ్రీనివాసరావుగారికి బహూకరించవలసిందిగా అభ్యర్ధిస్తున్నాను" వనమాలి అభ్యర్థనతో మంత్రి శాలువను కప్పి జ్ఞాపికను నా చేతికి అందించాడు.

నన్ను మాట్లాడమంటూ ఆహ్వానించాడు కార్యదర్శి. రుద్ధమైన కంఠంతో, కృతజ్ఞతా భారంతో కళ్ళలో నీటి సుడులు తిరుగుతుండగా 'మీ అభిమానపు బరువును ఎలా మోయను! మీ ప్రేమకు ఏం బదులివ్వను?' ఎక్స్ట్రా డైలాగులు చెబుతానని ఎదురుచూసి వుంటారు. అలాంటి ఆర్ద్రతా భావం గాని, ఆ టైపు డైలాగులు కానీ నా నోట రాలేదు. నా తొలి రోజుల్లో కవిత్వం గురించి చెప్పాను. కవిత్వం కోసం పడ్డ తపన గురించి చెప్పాను. నిజాయితీ కవిత్వానికి ఆత్మ అనీ, అది పోగొట్టుకొన్న కవిత్వం ఒట్టి కొయ్య బొమ్మ అనీ చెప్పాను. ఈ అవార్డును నా కవిత్వానికి గుర్తింపుగా భావించటము లేదనీ, కవిత్వాన్ని గుర్తించవలసిందీ, గుర్తింపు ఇవ్వాల్సిందీ ప్రజలేననీ చెప్పాను. జ్ఞానపీఠం అవార్డు అనే నెమలి పించాన్ని నా శిరస్సుపై అలంకరించుకోవాలనే భ్రమ నాకు లేదనీ, ఈ అవార్డు కారణంగా శ్రీనివాసరావుకు గుర్తింపు రావడం నా కిష్టంలేదనీ చెప్పాను.

సభికుల ముఖంలో అసంతృప్తి స్పష్టంగా కన్పిస్తోంది. కవి మిత్రులకు సరే కనీసం మంత్రిగారి కైనా కృతజ్ఞతలు చెప్పలేదే, ఒట్టి మొరటు మనిషిలా వున్నాడే అనుకుంటూ నిట్టూర్చారు సభికులు.

అకాడమీ వారి అధికార విందు. స్టార్ హోటళ్ళ నుండి స్పెషల్‌గా తెప్పించిన పదార్థాలు. పేర్లు సైతం తెలియని వింత వింత వంటకాలు. బఫే డిన్నరది. ఒక యువ రచయిత్రి ప్రేమగా ప్లేటు అందించింది. మరో వర్ధమాన కవి విస్కీ నింపిన గ్లాసు అందించాడు. ఎ.సి.రూము అది. బయట ప్రపంచం నుండి వేరు చేసి, ఒక విలాసవంతమైన స్వప్న భూమిలో విసిరివేసినట్లుగా వుంది.

వనమాలి ఘజళ్ళ చప్పుడు వినిపిస్తుంది ఒక మూల నుంచి. గుండె అరల్లో వదిలంగా దాచుకొన్న కవితా స్వప్నాలకు రెక్కలు వచ్చి ఆ ప్రదేశమంతా కువకువలాడుతున్నాయి. పార్టీలో తొలి దశ అది. అంటే ఒకటి రెండు పెగ్గుల దశ. పెగ్గులు పెరిగే కొద్దీ కవిత్వం తగ్గి, ఆత్మఘోష ఎక్కువవుతుంది. క్రమంగా ముఖంపై మందంగా మొలుచుకొచ్చిన నటనలు, డ్రామాల చర్మ కవచాల్ని పీకేసుకొని నిస్సిగ్గుగా, నగ్నంగా మారిపోతారు. అప్పుడు శ్రీనివాసరావు వీళ్ళకు కవి పిపీలికంగా కన్పిస్తాడు. నొసలు చిట్లించి దూరంగా జరిగిపోతారు.

గుంపులకు దూరంగా జరిగి ఒంటరిగా కిటికీ దగ్గర నిలబడ్డాను. బయట మేఘావృతమైన ఆకాశం. భయం కొలిపే చీకటి.

విందులోంచి మంత్రిగారు నిష్క్రమించారు. కవులందరూ సమూహాలుగా చీలిపోయారు. అభ్యుదయ కవులు, అనుభూతి కవులు, శ్రీశ్రీ అభిమానులు, విశ్వనాథ అభిమానులు, పద్య కవులు, అకాడెమీ కవులు, ప్రభుత్వ కవులు, ఐ.ఎ.ఎస్. కవులు ఎన్నెన్నో వైరుధ్యాలుగా, సమూహాలుగా విడిపోయి తెలుగు కవిత్వం, తన బలహీనతని, లేమిని నిస్సిగ్గుగా బహిర్గతం చేసుకుంటోంది.

"నమస్తే సార్!" మృదువైన స్వరం, శబ్ద కాలుష్యపు పొరల్ని చీల్చుకొని చెవుల్ని సోకింది. వెనక్కు తిరిగి చూస్తే విశృంఖలమైన నది లాంటి స్త్రీ మూర్తి. ఏ మేకప్పు, ఏ హంగామా లేని ఆహార్యం. ముఖంపై పడి అల్లరి చేస్తున్న ముంగురులు. పొగరుగా, నిర్భయంగా వున్న కళ్ళు.

"నా పేరు సరళ సార్! ఈ మధ్య బాగా పాపులర్ అయిన స్త్రీ వాద కవితోద్యమ కవయిత్రులలో ఒకదాన్ని. 'చితి-సతి' అనే నా కవితా సంకలనాన్ని చూసే వుంటారు".

"ఈ మధ్య వస్తున్న కవిత్వాన్ని అంతగా ఫాలో కావటం లేదమ్మా! అప్పుడప్పుడు ఎవరైనా కాంప్లిమెంటుగా పంపిన పుస్తకాల్ని చదవటం మినహా, పని గట్టుకొని ఏవీ చదవడం లేదు. మీ కవిత్వంలోని విశేషాలు చెప్పండి!"

"రండి! అటు వరండాలోకి వెళ్ళి మాట్లాడుకుందాం!" బయట వరండాలోకి దారి తీసింది. బయట వరండాలో ఒకటి రెండు జంటలు స్తంభాలకు చేరబడి ఏకాంతాన్ని నమిలి మింగుతున్నాయి.

సరళ పర్సులో దాచిన కవితల్ని బయటకు తీసింది. శ్రావ్యంగా వుంది తన గొంతు. కవితల్లో కొత్తదనం వుంది. అయితే కొన్ని క్షణాల పాటు తటిల్లతగా మెరిసి మాయమయ్యే చమక్కులే కాని గుండెల్లో నిలిచిపోయే వెలుగు దీపాలు కావా కవితలు.

కవితల్లోంచి వ్యక్తిగతంలోకి మళ్ళింది సరళ. చనిపోయిన మా అబ్బాయిని గుర్తు చేసుకుంది. "ప్రకాష్‌ని నేనెరుగుదును సార్! ప్రకాష్ వీరుడు. కొన్ని వందల మంచి కవితల్ని సృష్టించిన కవిగా కాక ప్రకాష్ తండ్రిగా మీరంటే నా కభిమానం"

ఆమె మాటలు సూటిగా గుండెల్ని తాకాయి. ప్రకాష్ మరణమనే కత్తి ఆమె మాటలకు మరికాస్త లోతుకు దిగి గుండెలు కలుక్కుమన్నాయి. కళ్ళలో నీళ్ళు. "నో సార్! మీరు ఏడవకూడదు. బాధను దిగమింగుకొని అతని స్మృతుల్నీ, ఆదర్శాల్నీ కవితల్లో నింపి, అస్థికల్ని నదిలో కలిపినట్లుగా జన సమూహాల మధ్య కలపాలి" ఏదో ట్రాన్స్‌లో వున్నట్టుగా మాట్లాడుతోంది.

"ఈ విందుకు మీరు రారనే అనుకున్నాను సార్! ఈ అకాడమీలు, అవార్డులు అందమైన వలల్లాంటివి. ఏ కవైనా ప్రభుత్వానికి చిక్కక ప్రజల మనిషిగా వున్నాడని అనుమానం వేస్తే ఈ వలల్ని విసురుతారు. ఈ దొంగ కబుర్లు, ఈ 'వినయంపు మాటలు', ఈ డ్రామాలు ఇవన్నీ డెత్ ట్రాప్‌లాంటివి. ఆహా, ఓహో కీర్తిసుఖం కోసం, రెండు చుక్కల

విస్కీకోసం అకాడమీ అనే వృద్ధ వేశ్య చుట్టూ మూగిన ఈగలు సార్ ఈ కవులు. ఈ వేశ్య దరిదాపులకు కూడా మీరు రావద్దు సార్!"

పెద్ద పెద్దగా అరుస్తూంది సరళ. కళ్ళలో ఎరుపుదనం రగిలి, ఆ క్షణంలో ఆమె కలకత్తా కాళికలా వుంది. ఉన్మాదినిలా క్రోధంగా, ప్రళయ భీకరంగా వుంది. హాలులో వున్న కవులందరూ ఆమె కేకలకు ఉలిక్కిపడి వరండాలోకి వచ్చారు.

వనమాలి ముందుకు దూసుకువచ్చి "సరళా డియర్! రిలాక్స్! నీ గుండెలోని వేదన మేం ఎరగనిది కాదు కదా! ప్లీజ్ కూల్‌డౌన్!" దగ్గరకు తీసుకోడానికి, ఓదార్చడానికి ప్రయత్నించాడు.

"గెట్‌లాస్ట్! యూ రాస్కెల్స్! ఎంగిలి కూటికై ఆశపడే కవి శునకాలు మీరు. ఈ మురికిలోకి శ్రీనివాసరావు గార్ని లాగాలనే మీ కుట్ర నేనెరగంది కాదు. దయచేసి ఆయన్ను వదిలేయండి! మీ పంజాలకు ఈ అమాయక వృద్ధ కవిని బలిచేయకండి!"

హఠాత్తుగా ఏ మూగ బాధో వెలికి వచ్చి సరళ వెక్కి వెక్కి ఏడుస్తూంది.

"పూర్ సోల్! ఆమె భర్త సూర్యం ఎన్‌కౌంటర్‌లో చనిపోయినప్పటి నుంచీ ఇదీ వరస. ఇద్దరూ ఉస్మానియాలో రీడర్సుగా పనిచేసేవాళ్ళు. ఒక దుర్ముహూర్తంలో అతడు పోలీసు తూటాలకు బలైపోయాడు. ఆ విషాదాన్ని నెమరువేసుకుంటూ ఈవిడిలా పిచ్చిదయిపోయింది. సారీ శ్రీనివాసరావుగారూ! మీరు బాగా డిస్ట్రబ్ అయినట్లున్నారు." వనమాలి ఓదార్పుగా భుజం తట్టి హాలులోకి తీసుకెళ్ళాడు.

పార్టీ చివరి దశకు చేరుకుంది. అందరూ తమ తమ నెలవులకు వెళ్ళే తొందరలో వున్నారు. "గుడ్‌బై"! 'సోలాంగ్' 'గొప్ప అనుభూతి' 'తీయని జ్ఞాపకం!' లాంటి డైలాగులతో పాత్రలన్నీ హాలు నుండి మెల్ల మెల్లగా నిష్క్రమిస్తున్నాయి.

## 4

"ఇవాళ సెప్టెంబరు పదమూడు" అన్నది సుధ. ఉదయాన్నే కాఫీ కప్పు అందిస్తూ.

అయితే ఏమిటి? అనబోయి ఆగిపోయాను. సెప్టెంబరు పదమూడు ప్రకాష్ చనిపోయిన రోజు. సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం... కళ్ళలో ఉబికే నీళ్ళు సుధ కంటబడకుండా పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాను. వేయి వసంతాలుగా వికసించాల్సిన తోట సమూలంగా మాడిపోయింది. పాతికేళ్ళ అనుబంధం పుటుక్కున తెగిపోయి మమ్మల్ని అనాథలుగా మిగిల్చిన విషాదం ఇది.

"గుడ్ మార్నింగ్ సర్!" సాహితి హడావుడిగా వచ్చింది.

"ఈ ఉదయంలో మంచి ఏమీ లేదు. అంతా విషాదమే, దుఃఖమే" అన్నాను నిట్టూర్పుస్తూ.

"సారీసర్! ఏదో కాజువల్‌గా అన్నాను. ఒక ముఖ్యమైన విషయాన్ని మీతో చర్చిద్దామని వచ్చాను. ముందుగా మీ అకాడమీ భవనపు విందుకు నా నిరసన తెలియ జేయనివ్వండి. పేపర్లో న్యూస్ ఐటమ్‌గా వచ్చింది. మీరు వెళ్ళకుండా ఉండాల్సింది.

విశ్వసనీయత, నిబద్ధత మనిషికి ఎంత ముఖ్యమో మీకు తెలియంది కాదు. వాటిని పాటించాల్సిన బాధ్యత రచయితలపై ఎంతో ఎక్కువగా వుంది. దయచేసి మేము మీపై పెట్టుకున్న విశ్వాసాన్ని వమ్ము చేయకండి! ఇంతకంటే ఎక్కువగా ఈ రోజు నేను మాట్లాడకూడదు. ఇవాళ బ్లాక్‌డే. మనకూ, ప్రపంచానికి అపురూపమైన వ్యక్తిని పోగొట్టుకున్న రోజు" ఎంతో మృదువుగా చెప్పిందా మాటలు సాహితి.

సాహితి ఒక ప్రియమైన వ్యక్తి మా ప్రపంచంలో. చనిపోయినవాళ్ళ వస్తువుల్ని అపురూపంగా చూసుకోవడం ఒక సెంటిమెంటు. ప్రకాష్‌కు అత్యంత ప్రియమైన నేస్తం సాహితి. విలక్షణమైన స్త్రీమూర్తి సాహితి. పాతికేళ్ళయినా వుండవేమో? వందేళ్ళ జీవితాన్ని చూసిన పరిణితి. ఆభరణాలు వాడదు. ఖరీదైన చీరలు కట్టదు. కృత్రిమత్వానికి, ఆడంబరానికి అతీతమైన భూమిపుత్రికలా వుంటుంది.

"జస్టిస్ కేశవరావు కమీషన్ రిపోర్టు వచ్చింది. ప్రకాష్‌ది ఆత్మహత్యేనని నిర్ధారణ చేశారు" సాహితి మాటలతో క్షణకాలంపాటు ప్రపంచము ఆగిపోయిందేమో అనిపించే విభ్రాంతి. ఒక సంచలనం. ఒక షాక్. "ఎవరూ ఊహించని తీర్పు ఇది. మూడేళ్ళ సుదీర్ఘ నిరీక్షణ తర్వాత చివరికి తీర్పు మన ముఖాన విసిరేశారు. నివేదిక పూర్తి పాఠాన్ని తీసుకొచ్చాను. చెయ్యి తిరిగిన రచయిత రాసిన గొప్ప ఫిక్షన్‌లా సాగింది. మనకు తెలియని 'సమీర', 'సమత' అనే రెండు పాత్రలు రంగంలోకి తీసుకురాబడ్డాయి. అన్నిటికంటే షాకింగ్, ప్రకాష్‌తో నాకున్న స్నేహం, చనువే అతని ఆత్మహత్యకు కారణమని నిర్ధారించటము. నిజనిర్ధారణకు ప్రకాష్ మన మధ్య లేడు. అజ్ఞాత పాత్రలు సమీర, సమత మన ముందుకు వచ్చి సాక్ష్యాన్ని ఇవ్వవు." సాహితి గంభీరంగా చెబుతూంది. బేలగా మారి రోదించాల్సిన సందర్భం అది. అయినా నిబ్బరంగా, బింకంగా వుంది.

"పోస్టుమార్టం రిపోర్టు మాటేమిటి? వంటిపై ఆ కముకు దెబ్బల మాటేమిటి? ఆత్మహత్యే అయితే అవన్నీ ఎందుకుంటాయి?" సందేహం వ్యక్తం చేశాను.

"కల్పనకు సాధ్యంకానిదేముంది? రిపోర్టు తీసుకువచ్చాను. మీరే చూడండి!" బరువైన కాగితాల కట్టను నా చేతికందించింది.

ఇరవై ముప్పయి పేజీలుంటాయి. మంచి పొయిటిక్ ఇంగ్లీషు. వాస్తవాలకంటే వివరణలు, వ్యాఖ్యానాలు ఎక్కువ వున్నాయి. వివరంగా చదవడం మొదలు పెట్టాను.

* * *

ఏ వాతావరణం, ఏ సందేహం, ఏ సంఘర్షణ, ఏ వైరుధ్యం ప్రకాష్ మానసిక ప్రపంచంలో ప్రశ్నలై మొలకెత్తి, మనోవైకల్యాలను కలిగించి, చివరకు ప్రాణత్యాగానికి పురికొల్పాయో చర్చించడము ఈ నివేదిక ప్రధానోద్దేశము.

ప్రకాష్ తండ్రి శ్రీకోలాహలం శ్రీనివాసరావు స్వాతంత్ర్య పోరాటయోధుడు. సుప్రసిద్ధ కవి. ఆయన రాజకీయ జీవితపు తాత్విక నేపథ్యాన్ని జనతంత్ర పార్టీ అందించింది. ఆయన ఆ పార్టీలో రాష్ట్రస్థాయి కార్యదర్శిగా చాలా సంవత్సరాలు పనిచేశాడు. శ్రీ

శ్రీనివాసరావుగారిది ప్రేమ వివాహం. ఆంధ్రదేశంలో స్థిరపడిన తమిళ యువతి సుధారాఘవన్‌తో స్వాతంత్ర్య పోరాటపు నేపథ్యంలో ప్రేమగా ఎదిగి ఆపై వివాహబంధం నెలకొంది.

ప్రకాష్ బాల్య ప్రపంచంలో భగవంతుడు లేడు. పండుగల కోలాహలం లేదు. ఆట పాటలు, అల్లరి లేవు. షేక్స్‌పియర్ ట్రాజడీల్లో కనబడే గంభీరమైన వాతావరణం. ఇంట్లో ఎప్పుడు చూసినా సభలు, సమావేశాలు. తండ్రి చుట్టూ ఎప్పుడూ పదిమంది దాకా మూగివుండేవాళ్ళు. రాత్రి, పగలు తేడా లేకుండా కాలపు సరిహద్దుల కతీతంగా ఇంట్లో ఎప్పుడూ ఏదో విషయం గురించి చర్చలు జరుగుతుండేవి.

ఏడేళ్ళ వయసులో ఒకసారి తండ్రితో విజయవాడ వెళ్ళాడు. బయట ప్రపంచానికి అదే అతని మొదటి ఎన్‌కౌంటర్. విజయవాడ ప్రక్కవూరిలో సిమెంటు కార్మికుల సమ్మె జరుగుతూంది. సమ్మెలో ఉపన్యసించడానికి శ్రీనివాసరావు వెళ్ళారు. శ్రీనివాసరావు ఉపన్యాసం తుపాను వేగంతో జనాన్ని తాకింది. కార్మికుల్లో అనూహ్యమైన సంచలనం. క్రోధావేశాలు. జనం ప్రోలోమంటూ ఫ్యాక్టరీ గేట్లను తోసుకొని లోపలికి వెళ్ళారు. తమ కష్టాలకు, బాధలకు ఆ ఫ్యాక్టరీ సింబాలిక్ శత్రువుగా తోచి దాన్ని నాశనం చేయడం మొదలు పెట్టారు. పోలీసుల రాక. లాఠీఛార్జీ దానితో ఫలితం లేక పోగా గాలిలోకి కాల్పులు జరిగాయి. ఆ కాల్పుల్లో ఇద్దరు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. రక్తసిక్తమైన వాళ్ళ దేహాలను భుజాలపై వేసుకొని కొంతమంది హాస్పిటల్‌వైపు పరిగెత్తారు. రక్తము, కన్నీళ్ళు, కార్మికుల ఆగ్రహావేశాలు, పోలీసుల రాక్షస తాండవము అన్నీ కలిపి బీభత్సరస ప్రధానమైన సినిమాని చూస్తున్న అనుభూతినిచ్చాయి ప్రకాష్‌కు. భయంతో వణికిపోయాడు ప్రకాష్. కొంతమంది మనుషుల సాయంతో కారులో ఇంటికి పంపించారు ప్రకాష్‌ను.

ఏడేళ్ళ ప్రకాష్ మనస్సులో ఈ సంఘటన వింత వింత స్పందనలు రేపింది. తానూ, తన కుటుంబం మిగిలిన ప్రపంచంతో పోల్చడానికి వీలులేని భిన్నమైన జీవితాన్ని గడుపుతున్నట్టుగా అర్థమైంది. పోరాటం వాళ్ళ వారసత్వం. ఒక మహోన్నతమైన ఆదర్శం కోసం బ్రతుకుతున్న ప్రత్యేకమైన మనుషులు వాళ్ళు. "ఆవాల్టి సభలో నాన్నగార్ని చూస్తే మండుతున్న అగ్నిగోళంలా వున్నారు. ఆయన మాటలతో ఒక మహాసముద్రం ఉప్పొంగినట్లు జనం జేజేలు కొట్టారు. ఆయన మహోన్నత వ్యక్తి! ఆయన బిడ్డగా నేను తగుదునా అని నాకు సందేహంగా వుంది" అంటూ ప్రకాష్ తన డైరీలో రాసుకున్నాడు. బాల్యపు సహజమైన చిలిపితనాన్ని, అల్లరిని గుండెల్లో అణిచివేసుకొని, గంభీరమైన ధీరోదాత్తమైన పాత్రలా వుండాలని ప్రయత్నించేవాడు. సినిమాలు, నాటకాలు, పిక్నిక్‌లు, సాయంకాలపు ఆటలు మొదలైన బాల్యపు ఆనందగీతాల మాధుర్యాన్ని తెలియకుండా పెరిగాడు.

ఒక ఇంట్రోవర్ట్‌గా ఎడోలెసెన్సీలోకి ప్రవేశించాడు ప్రకాష్. పదిహేడేళ్ళ ఇంటర్మీడియట్ విద్యార్థి ప్రకాష్‌కు లలిత పరిచయమైంది. లలిత ప్రజా పోరాట పార్టీ అనే తీవ్రవాద పార్టీకి చెందిన సభ్యురాలు. లలిత మంచి గాయని, వక్త, స్నేహశీలి. అన్నిటికన్నా అన్యాయాన్ని, అవినీతిని సహించని యాంగ్రీయంగ్ ఉమెన్. లలితను చూస్తే ప్రకాష్‌కు

ఆశ్చర్యమేస్తుంది. పరిస్థితులపైన, మనుషులపైన అలా క్షణాల్లో అధికారం ఎలా సాధించగలడు అని విస్తుపోయాడు. రాగింగ్‌కు వ్యతిరేకంగా లలిత జరిపిన పోరాటం కాలేజీలో సంచలనాన్ని సృష్టించింది. రాగింగ్ చేసే సీనియర్ విద్యార్థుల్ని చెప్పులదండతో సన్మానించింది. ఈవ్ టీజింగ్ చేసే కుర్రవాళ్ళ గుండెల్లో రైళ్ళు పరిగెత్తించింది. ఒక సభలో అమర్యాదగా ప్రవర్తించినందుకు పోలీసు ఇన్‌స్పెక్టరు చెంప పగలగొట్టింది. లలిత ప్రకాష్‌కు 'ఐడియల్ షి' అయ్యింది.

లలిత ప్రకాష్‌ను గ్రామాలకు తీసుకెళ్ళింది. రైతు కూలీల, పేద కార్మికుల జీవన విషాదాన్ని విశద పరచింది. జానపదుల భాషలో వాళ్ళ కష్టాలను పాటలుగా పాడి వాళ్ళను చైతన్యవంతులను చేసి, వాళ్ళచేత పోరాటాన్ని సాగిస్తున్న వైనాన్ని తెలియ జేసింది. అదంతా ఒక సాహసిక ప్రపంచంలా తోచింది ప్రకాష్‌కు. ప్రకాష్ ప్రజాపోరాట పార్టీలో సభ్యుడైనాడు.

ప్రకాష్ మెడికల్ కాలేజీలో చేరేనాటికి ప్రజాపోరాట పార్టీలో ప్రముఖ వ్యక్తి అయ్యాడు. అతనికిప్పుడు సిద్ధాంతాల మీద కమాండ్ వచ్చింది. సమకాలీన రాజకీయ పరివర్తనం గురించి సాధికారంగా మాట్లాడగలడు. విద్యార్థులను చైతన్యవంతులుగా చేసి వాళ్ళను మిలిటెంట్లుగా మార్చగల ఉపన్యాస దక్షత, వివరణ శక్తి వచ్చాయి. ప్రకాష్ మనః ప్రపంచం ఒక ఉన్మాదగీతంలా వుండేది. ఉపన్యాసాలు, సమావేశాలు, కరపత్రాలు, ప్రకటనలు చేయడాలు, సమస్యలపై విద్యార్థులను సమీకరించడము, ఇదంతా ఒక యాంత్రిక ధృతిలో సాగేవి.

ఇరవై ఒక్క సంవత్సరాల ప్రకాష్ ప్రపంచంలోకి 'సమీర' ఇంద్ర ధనస్సులా కొత్త కాంతుల్ని తీసుకు వచ్చింది. సమీర ప్రజా పోరాట పార్టీలో కొత్తగా అడుగుపెట్టిన కార్యకర్త. అర్థాంతరంగా చదువును ఆపివేసి పూర్తిసమయం పార్టీ కోసం పాటుపడుతున్న యువతి.

సమీరతో అనుబంధం ప్రకాష్‌లో వినూత్నమైన మార్పుల్ని తెచ్చింది. అద్భుతమైన సంగీత గమకాలేవో తన నాడులపై ప్రవహిస్తున్నట్లుగా అనుభూతిని చెందాడు. సమీరను మినహాస్తే జీవితానికి అర్థం లేదనిపించేలా ఆమెతో గాఢమైన అనుబంధాన్ని పెంచుకొన్నాడు. ఈ కేసు విచారణ కోసం శ్రీమతి సమీర పంపిన డైరీలలో ఈ విషయం స్పష్టంగా, బలంగా కనబడుతుంది. నిజానికి ఈ కేసుకు శ్రీమతి సమీర పంపిన ప్రకాష్ డైరీలు, ఉత్తరాలే ముఖ్య ఆధారాలు. శ్రీమతి సమీర తనకున్న వ్యక్తిగత ఇబ్బందుల వల్ల అజ్ఞాతంగానే వుండిపోయారు. కమీషన్ ఎంతగా అభ్యర్థించినా ఆవిడ తన సాక్ష్యం ఇవ్వడానికి కమీషన్ ముందు హాజరుకాలేక పోయారు.

ప్రకాష్ చనిపోవడానికి సరిగ్గా రెండేళ్ళకు ముందు సమీర, ప్రకాష్‌ల పెళ్ళి జరిగింది. పార్టీ ఈ పెళ్ళికి అభ్యంతరం చెప్పింది. కుటుంబ జీవనం ఆదర్శాలకు అవరోధమని, తన గమ్యాలకు, లక్ష్యాలకు ప్రతిబంధకమని వారించింది. అయితే పార్టీ ప్రయోజనాలకు భిన్నంగా ప్రవర్తించమనే హామీతో ప్రకాష్, సమీరలు పెళ్ళి చేసుకున్నారు. ప్రకాష్ తల్లి దండ్రులకు, మిత్రులకు తెలియని రహస్య వివాహమిది. నిజానికి ప్రకాష్ తన తల్లిదండ్రుల

నుంచి చాలా రోజుల క్రితమే డిటాచ్ అయ్యాడు. తీవ్రవాద పార్టీతో తనకున్న సంబంధాలు కానీ, తన కార్యకలాపాల గురించి గానీ ఏనాడూ తన తల్లిదండ్రులకు తెలియ జెయ్యలేదు.

ప్రజా పోరాట పార్టీపై ప్రభుత్వం నిర్బంధం ఎక్కువైంది. అప్పుడప్పుడు కొందరు సభ్యులు ఎన్‌కౌంటర్ల పేరుతో మృత్యువు పాలవుతున్నారు. ప్రకాష్ తల్లిలా, సోదరిలా ఆరాధించిన 'లలిత' ఒక ఎన్‌కౌంటర్‌లో అశువులు బాసింది. లలిత మరణం అనూహ్యమైన షాక్ ప్రకాష్‌కు. కనపడని తల్లికోసం కొడుకు ఏడ్చినట్లుగా పొగిలి పొగిలి ఏడ్చాడు. సమీరకు కూడా అది ఎదురుచూడని విషాదం.

ప్రకాష్‌కు సమీర గురించి 'భయం' మొదలైంది. సమీర కూడా చనిపోతే, ఆ ఊహ కూడా తట్టుకోలేక పోతున్నాడు. అతని డైరీలో ఒకచోట ఇలా రాసుకున్నాడు – "సమీర ఇరవై యేళ్ళ అన్వేషణ తరువాత నాకు లభించిన ఆశ్రయం. బాల్యం నుంచి నన్ను కలవర పెట్టే ఒంటరితనానికి సమాధానం. నన్ను భయపెట్టే అర్థంకాని భయాలకు ఓదార్పు" అలాంటి సమీరకు ఏమైనా అయితే? అనే భయం ఒక వ్యాధిలా ప్రకాష్‌ను చుట్టుముట్టింది.

ఫ్యామిలీ ప్లానింగ్ పద్ధతులపై సరైన అవగాహన లేక సమీర గర్భవతి అయ్యింది. ఎబార్షన్ చేయించుకోమని మిత్రులు సలహా ఇచ్చారు. సమీర "ఇది మీకు సంబంధము లేని విషయం. దీంట్లో మీ జోక్యం అనవసరం" అంది.

ప్రకాష్ చనిపోడానికి సరిగ్గా ఆరు నెలలకు ముందు సమీరకు పాప పుట్టింది. పాప పేరు 'సమత'.

కుటుంబ జీవనపు మాధుర్యమో, పాపపై హఠాత్తుగా పెరిగిన అనురాగబంధమో, ప్రకాష్‌లో చిత్రమైన మార్పు వచ్చింది. పార్టీ నుంచి బయటకు వెళ్ళిపోదాం అని సమీరను పోరు పెట్టడం మొదలు పెట్టాడు. దానికి సమీర తీవ్ర అభ్యంతరము చెప్పింది. అయినా ప్రకాష్ ప్రయత్నాలు ఆపలేదు. తనలాంటి ఆలోచన వున్న కొద్దిమంది సభ్యుల్ని రహస్యంగా కలిసి రెబల్ గ్రూప్ తయారుచేశాడు.

ప్రకాష చనిపోడానికి ముందు సరిగ్గా నెల క్రితం పదిమంది యువకులతో కలిసి ప్రజాపోరాట పార్టీ నుంచి బయటకు వచ్చేశాడు. ప్రకాష్‌కు ఊహించని షాక్ సమీర తిరస్కారం. సమీర పార్టీ నుంచి బయటకు రావడానికి ఒప్పుకోలేదు. ప్రకాష్ బ్రతిమాలాడు. బెదిరించాడు. అయినా సమీరలో మార్పు లేదు.

"నీలాంటి పిరికివాణ్ణి ప్రేమించినందుకు సిగ్గుపడుతున్నాను. నీతో గడిపిన క్షణాల్ని సిగ్గుతో, అవమానంతో కడిగేసుకోలేని మాలిన్యంగా భావించి ఆ మేరకు నువ్వంటే వెగటు కలుగుతుంది. బ్రతుకు మీదా, సుఖాల మీదా ఇంతటి మమకారమా నీకు! మెడిసిన్ పూర్తి కావస్తుంది కదా! ఇకనేం ఒక నర్సింగ్ హోమ్, లక్షల సంపాదన, గొప్పగా ప్లాన్ వేశావు. మన మధ్యన సున్నితమైన అనుభూతులు, బంధాలు ఎక్స్‌ట్రాలు నువ్వు పార్టీ నుంచి పారిపోయిన క్షణానే తెగిపోయాయి. సో, గుడ్ బై ఫర్ ఎవర్!" ప్రకాష్ జీవితంలో ఊహించని మలుపు యిది. పిడుగుపాటులాంటి దెబ్బ ఇది. ఈ సంఘటనతో బాల్యం నుంచి ఎదురవుతున్న వైరుధ్యాల సంఘర్షణ పరాకాష్టకు చేరింది. ప్రకాష్‌లో మానసిక వ్యాధి లక్షణాలు మెల్లగా

మొలకలెత్తాయి.

తల్లి దండ్రులకు, ప్రకాష్‌కు మధ్య ప్రేమబంధాలేమైనా వుండివుంటే ప్రకాష్ ఈ స్థితి నుంచి బయటపడడానికి అవకాశం దొరికేది. కానీ శ్రీనివాసరావు దంపతులు తమదైన వింత సైద్ధాంతిక ఏకాంతములో తామున్నారు. పైగా వాళ్ళను పీడించే దారిద్ర్యం.

ప్రకాష్‌ను రక్షించే ఉద్దేశంతోటే సుధాకర్ అనే మిత్రుడు ప్రకాష్‌కు తాగుడు అలవాటు చేశాడు. బార్ నుంచి బయటకు వచ్చిన తరువాత ప్రకాష్ ఆత్మ ముక్కలు ముక్కలుగా చితికి పోయేది. తీవ్రమైన ఆత్మన్యూనతా భావం కలిగేది. 'నీలాంటి పిరికివాణ్ణా...' అంటూ సమీర అన్న మాటలు గుర్తుకొచ్చేవి. వర్గ పోరాటానికి సరే, మామూలు జీవితానికి సైతం తనకు అర్హత వుందా? అనిపించేది. కొన్నిక్షణాల మత్తుకోసం, కొన్ని కోట్ల క్షణాల నరకాన్ని కొనితెచ్చుకున్నాడు ప్రకాష్.

ప్రకాష్ పరిస్థితిపై అందరికీ సానుభూతి వుంది. అతన్ని ఆ స్థితి నుంచి రక్షించాలని మిత్రులందరి ప్రయత్నం. అయితే అతని అంతరంగ మధనాన్ని ఎవరూ గుర్తించలేదు. సాహితి కూడా ప్రకాష్‌ను రక్షించాలనే ప్రయత్నించింది. సన్నిహితంగా మెలిగి, స్నేహితుల ఇళ్ళకు తీసుకెళ్ళి, ఎంతో మానసిక స్థైర్యాన్ని ఇవ్వడానికి ప్రయత్నించింది.

ప్రకాష్ చనిపోడానికి కొన్ని గంటల ముందు సాహితీ, ప్రకాష్ కలిసి చాప్లిన్ సినిమా సిటీలైట్స్‌కు వెళ్ళారు. అటు నుంచి 'వర్తమాన కవిత' అనే చిన్న సాహితీ సభకు వెళ్ళారు. సుమారు రాత్రి పది గంటల వేళ ఆ సభ నుంచి బయటపడ్డారు. నవయుగ రెస్టారెంట్‌లో మీల్స్ పాక్ చేయించుకుని ప్రోగ్రెసివ్ ఫోరమ్ ఆఫీసుకు వెళ్ళారు. సాహితి రెండు ఔన్సుల విస్కీ ప్రకాష్‌కు ఆఫర్ చేసింది. ఒక డాక్టరుగా అదో చికిత్సగా మాత్రమే ఆ విస్కీ ఇచ్చింది. ఇద్దరూ కలిసి భోజనం చేశారు.

అప్పటికి రాత్రి పదకొండు గంటలైంది. సాహితి హాస్టలుకు వెళ్ళవలసి వుంది. ఆ ఏకాంతపు రాత్రిలో వాళ్ళిద్దరూ శారీరకంగా ఏకం అయ్యారు. సాహితి ప్రోత్సహించిందో లేదా ప్రకాషే బలవంతం చేశాడో ఇప్పుడు స్పష్టంగా చెప్పలేము. ఈ విషయాన్ని ప్రస్తావించినపుడు డాక్టర్ సాహితి ఉగ్రురాలైంది. అన్నీ కట్టుకథలంటూ కమీషన్ని నిందించింది. అయితే ప్రకాష్ డైరీలు, అతను రాసిన చివరి ఉత్తరం ఈ విషయానికి బలమైన సాక్ష్యాలు.

సాహితికి అది తొలి అనుభవం కాబోలు. చిత్రమైన స్పందన అది. భయమో, ఆనందమో తెలియని మానసిక స్థితిలో ప్రకాష్‌ను అలాగే వదిలివేసి హాస్టలుకు చేరింది. అప్పటికి రాత్రి పన్నెండు గంటలైంది. అప్పటి నుంచి మరో రెండు గంటల పాటు జరిగిన మానసిక సంఘర్షణ ప్రకాష్‌ను ఆత్మహత్యకు పురికొల్పింది. తన ఆదర్శాల సింహాసనం కూలిపోయి, తను నిత్యం ద్వేషించే విలువల రాహిత్యంలోకి కూరుకుపోయినట్లుగా భావించుకొని కలతచెందాడు. సాహితితో ఏర్పడ్డ అనుబంధం అతనికి ఉత్సాహాన్ని కాక తనపై తనకే ద్వేషాన్ని కలిగించేలా చేసింది. "నీతోనా ఇన్నాళ్ళు సాహచర్యం చేశాను?" అన్న సమీర మాటలు గుర్తుకొచ్చి బాధతో మెలికలు తిరిగిపోయాడు. తను సమీరకే గాక తల్లిదండ్రులకు కూడా అవమానాన్ని కలిగించిన అల్పజీవిగా భావించుకున్నాడు.

ఆత్మహత్యచేసుకోడానికి ముందు సమీరకు వ్రాసిన ఆఖరి ఉత్తరం ఈ కేసు మొత్తానికి ప్రధాన సాక్ష్యం.

సమీరా!

ఉత్తరాన్ని చింపివేయకుండా సావధానంగా చదువు. నా నుంచి మరో ఉత్తరమో, కబురో నిన్ను ఇక ఇబ్బంది పెట్టబోదు. హామీ ఇస్తున్నాను.

సమీరా! నా సమీరా! నువ్వు నాకు జీవిత సహచరివి మాత్రమేనా? నన్ను లాలించి, ఆదరించిన తల్లివి కాదా? నాకు పోరాటపు తీరు తెలియజేసి, భుజం భుజం కలిపి ముందుకు సాగిపోవడానికి ధైర్యాన్నిచ్చిన స్నేహితురాలివి కాదా? నా బలహీనక్షణాలు నన్ను వివశుణ్ణి చేస్తే నన్ను శాసించి, బెదిరించి నిశ్చలస్థితిలో నిలిపిన గురువ్వు కాదా?

ఇన్ని అనుబంధాలు నీతో పెనవేసుకున్న నన్ను ఇంత తేలిగ్గా ఎలా త్రోసివేయగలిగావు? వ్యక్తి కన్నా ఆదర్శం గొప్పదే! నిజమే! కానీ ఆదర్శపు ఎత్తుల నుంచి జారిపోయే నీవాళ్ళకు చేయూత నివ్వాలనే ధర్మాన్ని ఎలా మరిచిపోయావు?

సమీరా! ఎంతో ఒంటరిగా అనిపిస్తుంది. బాల్యంలో యిలాగే, అమ్మ నాన్నలు పార్టీ మీటింగులకు వెళితే ఇంటిలో ఒక్కణ్ణే కారణం తెలియని దుఃఖంతో వెక్కి వెక్కి ఏడ్చేవాణ్ణి. ఎవరికీ, దేనికీ చెందని వాడిలా భావించుకొని, అర్థంకాని శూన్యంలోకి జారిపోతున్నాననే భయం కలిగేది. సమీరా! ఈ క్షణం అలాంటి ఒంటరితనమే భయమే నన్ను చుట్టు ముట్టుతున్నాయి.

సమీరా! ఎత్తైన శిఖరం నుండి క్రిందకు జారాను. ఈ లోయలో నిస్సహాయంగా కొట్టుకులాడుతున్నాను. ఇప్పుడు ప్రకాష్ తాగుబోతు. స్థిరమైన విలువలు లేనివాడు. పోరాటంలో చేయి కలిపిన స్నేహితురాల్ని సైతం రేప్ చెయ్యగల రాక్షసుడు. ఈ గిల్టీనెస్ తట్టుకోలేక పోతున్నాను. ఈ బాధ, అవమానభారంకన్నా మరణం నయం అనిపిస్తున్నది.

అవును సమీరా! జీవితాన్ని ముగిస్తున్నాను. నిన్ను చూడాలని ఉంది. నీ ఒడిలో తలపెట్టుకొని 'క్షమించు సమీరా!' అని ఏడ్వాలని ఉంది. సమతతో ఆడుకోవాలని ఉంది. నాకు నిజంగా బ్రతకాలనుంది. తల్లి, తండ్రీ, భార్యా పిల్లలు అందమైన కలలాంటి బ్రతుకు బ్రతకాలనుంది. కానీ ఆలస్యమై పోయింది. ఇది వెనక్కు తీసుకోలేని అడుగు. ఇది ఎన్నటికీ తిరిగిరాని వసంతం.

సెలవు ప్రియతమా! సెలవు!

"ప్రకాష్"!

ప్రకాష్ చనిపోవడానికి మెడికల్ కాలేజీనే ఎందుకు ఎంచుకున్నాడో స్పష్టంగా చెప్పలేము. ఆ రాత్రి ప్రోగ్రెసివ్ ఫోరం ఆఫీసు నుండి మెడికల్ కాలేజి వైపుకు వెళుతున్న ప్రకాష్‌ను రహీమ్, వెంకట్రావు అనే లోకల్ గూండాలు అడ్డగించి అతని దగ్గర ఉన్న డబ్బు, వాచీ ఇమ్మని బెదిరించారు. ప్రతిఘటించిన ప్రకాష్‌ను సైకిల్ చెయిన్‌లతో, హాకీ స్టిక్‌లతో చితక బాదారు వాళ్ళు. రహీమ్‌ను, వెంకట్రావును పోలీసులు రిమాండ్‌లోకి తీసుకున్నారు. వాళ్ళ దగ్గర నుండి ప్రకాష్‌కు సంబంధించిన వస్తువులు స్వాధీన పరచుకున్నారు.

సుమారు ఒంటిగంట ఇరవై నిముషాలకు ప్రకాష్ ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రకాష్ మరణం తరువాత జరిగిన అల్లర్లు, ఉద్యమాలు కమీషన్ దృష్టిలోకి వచ్చాయి.

పౌర హక్కుల సంఘం వాళ్ళు ఆరోపించినట్లు ఇది లాకప్ మరణం కాదు. ప్రకాష్‌ను చంపే అవసరం పోలీసులకు లేదు. ప్రకాష్‌లాగా ఉద్యమాన్ని వదిలి వచ్చినవాళ్ళు పోలీసులకు కొంగుబంగారం లాంటివాళ్ళు.

ముఖ్యమైన సాక్షులెవరూ కమీషన్ ముందుకు రావడానికి తిరస్కరించటంచేత విచారణలో అవసరమైన జాప్యం జరిగింది. ప్రకాష్ ఉత్తరాలు, డైరీలే ఈ కేసుకు ప్రధాన సాక్ష్యాలు. వాటిని ఈ నివేదికకు సప్లిమెంటుగా అందిస్తున్నాము.

* * *

నివేదిక ముగించి దీర్ఘంగా నిట్టూర్చాను. కళ్ళవెంట నీళ్ళు కూడా రాలేదు. ఏదో శూన్యం. కొండను తవ్వి ఎలుకను పట్టినట్టు మూడేళ్ళ విచారణ తరువాత ప్రకాష్ ఆత్మహత్య అని తేల్చేడు జస్టిస్ కేశవరావు. సమీర, సమతలు నిజంగా ఉన్నారా? లేక కల్పనా జగత్తునుండి ఊడిపడ్డారా అనేది ఎప్పటికీ జవాబు దొరకని ప్రశ్నే!

## 5

పీడకల ఒకటి వచ్చి భయంతో నిద్ర లేచాను. పన్నెండు గంటలు దాటి ఉంటుంది. ప్రక్కనే సుధ గాఢ నిద్రలో ఉంది. ఎంత భయంకరమైన కల. నాకు అంత్యక్రియలట. నా శవం వెనుక గుండెలవిసేలా రోదిస్తున్న సుధ. వందలాదిగా సాహితీ అభిమానులు నా శవం చుట్టూ మూగి నినాదాలిస్తున్నారు "శ్రీనివాసరావు మేలుకో! మరణమనే మహా నిద్ర నుంచి మేలుకో!" ఆ నినాదాలు ఎంత పెద్దగా ఉన్నాయంటే, వాటి ప్రతిధ్వనులు నా చెవుల్లో గిర్రుమంటున్నాయి, వినిపిస్తున్నాయి. కిటికీ రెక్క తీసి బయటకు చూస్తే, అక్కడ పట్టపగలు లాంటి వెలుగు. చిన్న మీటింగ్ ఏదో జరుగుతున్నట్లుంది. సుమారు యాభై మంది దాకా ఉన్న జనం. మధ్యలో రెండు కుర్చీలు వేసి ఉన్నాయి. ఒక కుర్చీలో వృద్ధ మహిళ కూర్చుని ఉంది. మరో ఖాళీ కుర్చీ అజ్ఞాత ఉపన్యాసకుడి కోసం ఎదురు చూస్తుంది. నన్ను చూడగానే జనంలో కేరింతలు. వీధి ఒక్కసారిగా నినాదాలతో హోరెత్తింది. "మహాకవీ! మేలుకో!" కలలో విన్న నినాదాలే. దట్టంగా గడ్డం పెంచిన యువకుడు జనాన్ని వారించి "మహాకవి స్వాగతం! మీ కోసమే ఈ సభ ఎదురు చూస్తుంది! బయటకు రండి!" అంటూ ఆహ్వానించాడు.

అనాలోచితంగా, వింత క్యూరియాసిటీతో బయటకు వచ్చాను. నన్ను వేదికవైపు ఆహ్వానించాడు గడ్డపు యువకుడు. మరో కుర్చీలో ఒక భిక్షువర్షీయసి కూర్చుని ఉంది. ముడుతలు పడ్డ శరీరం. ముగ్గుబుట్టలాంటి తల. జీవంలేని కళ్ళు. ఎండిపోయిన చర్మంలోంచి బయటకు పొడుచుకు వచ్చిన అస్తిపంజరం. ఎంత దయనీయంగా ఉంది!

"సాహితీ మిత్రులారా!" గడ్డపు యువకుని కంఠం ఖంగుమంది.

"నాపేరు భాస్కర్. చారిత్రాత్మకమైన ఈ సభకు అధ్యక్షత వహించగలిగే భాగ్యాన్ని పొందిన వాణ్ణి. ఇది పుస్తకావిష్కరణ సభ. తెలుగు సాహితీ చరిత్రలో అపూర్వం అనదగ్గ సభ ఇది. "ఉద్విగ్న కవులు" అనే అయిదుగురు కవులు వ్రాసిన 'అగ్ని తరంగాలు' అనే కవితా సంకలనాన్ని ఇక్కడ ఆవిష్కరిస్తున్నాము. ఈ అర్ధరాత్రి పన్నెండు గంటలకు ఫుట్‌పాత్‌పై జీవించే రాములమ్మ అనే వృద్ధ మాతృమూర్తితో ఈ సంకలనాన్ని ఆవిష్కరింపజేస్తున్నాం. ప్రస్తుతం కవిగా మరణించినా, ఒకప్పుడు మహాకవిగా మనం ఆరాధించిన శ్రీనివాసరావు మొదట కాపీని అందుకుంటాడు. ఉద్విగ్న కవుల్లో ఒకడైన రాజు ఈ కవితా సంకలనం యొక్క చారిత్రక ఆవశ్యకత గురించి వివరిస్తాడు" అంటూ మరో యువకుడివైపు చేయి చూపాడు.

సన్నగా, పొడవుగా ఉన్న యువకుడు వేదికపైకి వచ్చాడు. లాల్చీ, పైజమా భుజానికి తగిలిచ్చిన సంచీ. ఉద్రేకాన్ని సూచిస్తున్నట్టుగా బిగుసుకున్న పిడికిళ్ళు. అతని కంఠంలో కసి, దేనిపైనో విరక్తి ధ్వనిస్తున్నాయి. సుమారు అర్ధగంటసేపు మాట్లాడాడు. తెలుగు సాహిత్యంలో ఏర్పడ్డ స్తబ్దత గురించి మాట్లాడాడు. కవుల హిపోక్రసీపైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశాడు. తమ సాహితీ ఉద్యమం ఒక చారిత్రక ఆవశ్యకత అనీ, సాహిత్యపు పుటలకు పట్టిన చెదలను దహించే అగ్నివర్షం తమ కవిత్వం అనీ, తెలుగు సాహిత్యంలో ఇదో కొత్త యుగానికి ఆరంభమనీ చెప్పాడు. పుస్తకంలోంచి ఒక కవితను చదివాడు. 'రక్త కాసారము' దాని పేరు. సరికొత్త వ్యక్తీకరణ. మంచి భవిష్యత్తు ఉంది ఈ కుర్రవాళ్ళకు అనిపించింది.

భాస్కర్ మళ్ళీ వేదికపైకి వచ్చాడు. "ఉద్విగ్న కవుల తరపున, ఇక్కడకు వచ్చిన సాహితీ మిత్రుల తరపున కవి శ్రీనివాసరావుగారికొక నివేదన. మహాకవీ! మీరు ఇప్పటికే కవిగా మరణించారు. కవిగా మీ మరణాన్ని హుందాగా ఒప్పుకోకుండా, చౌకబారు చెత్తను రాసి ఆంధ్రదేశాన్ని పీడిస్తున్నారు. అందుకు కూడా మిమ్మల్ని క్షమించాము. కానీ ఇప్పుడీ జ్ఞానపీఠం అవార్డుతో మీరు ప్రజా కవిత్వపు ఉనికినే నవ్వులపాలు చేస్తున్నారు. మీరీ అవార్డును స్వీకరించడానికి వీల్లేదు. ఈ అవార్డును తీసుకోబోవటం లేదని స్పష్టమైన హామీని మాకివ్వాలి. అదీ ఈ సభాముఖంగా. ఈ ఆవిష్కరణ సభ మీ ఇంటి ముందు జరుపుకోవడంలోని ఆంతర్యం ఇదే." భాస్కర్ మాటలతో నాలో ఒక ఆవేశ తరంగం ఎగిసింది. ఏమిటి వీళ్ళ దబాయింపు? తెలుగు కవిత్వానికి వీళ్ళొక్కళ్ళే ప్రతినిధులా? నా కవిత్వంపై డిక్రీలు యివ్వడానికి వీళ్ళస్థాయి ఏమిటి? కవిగా మరణించటమంటే ఏమిటి? కోపంగా కుర్చీలోంచి లేచాను.

హఠాత్తుగా రెండు బలమైన చేతులు నా భుజాల్ని నొక్కిపట్టి "మిమ్మల్ని వెళ్ళనివ్వం! ఇప్పటికే జనాల్ని వదిలి చాలా దూరం పారిపోయారు మీరు. సభ అయిపోయే వరకూ మిమ్మల్ని ఇక్కడ నుండి కదలనివ్వం!" ఆ చేతులు ఇందాక మాట్లాడిన యువకవి రాజువి. కోపంగా, నిస్సహాయంగా అలాగే కూలబడ్డాను కుర్చీలో.

ఐదు నిముషాలు గడిచాయో లేదో సభలో హడావుడి రేగింది. పోలీసు జీపులు రెండు సభ దగ్గరలో ఆగాయి. సభికుల్లో కోపం, అలజడి, "ఇది సాహితీ సభ! ఇక్కడ

పోలీసుల జోక్యం అనవసరం. దయచేసి ఈ వాతావరణాన్ని హింసాత్మకంగా మార్చకండి" భాస్కర్ కోపంగా అరిచాడు.

జనాన్ని చీల్చుకుంటూ ఎస్.ఐ., ఇద్దరు కానిస్టేబుళ్ళు వేదికవైపు వచ్చారు. "శ్రీనివాసరావుగారిపై మీరు బలప్రయోగం చేస్తున్నారని చుట్టుపక్కల ఇళ్ళవాళ్ళు ఫోన్ చేశారు. ఆయన్ను వదిలిపెట్టండి. ఆయన్ను యింట్లోకి పంపిన తరువాత మీరు సభను నిరభ్యంతరంగా కొనసాగించుకోవచ్చు" అంటూ ఎస్.ఐ. నా దగ్గరకు వచ్చాడు. "సార్! మీరు లేవండి! ఇంట్లోకి పదండి! తెల్లారే వరకు ఇద్దరు కానిస్టేబుళ్ళు మీ యింటి దగ్గర కాపలా ఉంటారు" అంటూ నాకు దారి చూపించాడు.

వాళ్ళ వెంట బయలుదేరిన నన్ను చూసి "జనం మధ్య నిలబడడానికి భయపడే నిన్నా ఇన్నాళ్ళు ప్రజాకవిగా మేము ఆరాధించింది! ఫో! పోయి నీ ఏకాంతపు సమాధిలో లుకలుకలాడు. ఇది 'ఉద్విగ్న కవుల' ఆవిష్కరణ సభగా మాత్రమే కాదు, నీ కవితా జీవితపు ముగింపుగా కూడా మాకు గుర్తుండిపోతుంది" భాస్కర్ గర్జించాడు.

అవమాన భారంతో ఇంటిలోకి నడిచాను. సుధ సానుభూతిగా నావైపు చూసింది. "అక్కడే ఉండి వుండాల్సింది. ఈ అవమానాలు, అవహేళనలుమీకు కొత్త కాదుకదా! పోలీసుల సాయంతో పారిపోయారని మిమ్మల్ని ఎద్దేవా చేసే అవకాశం వాళ్ళకుండేది కాదుకదా!" అంది. మౌనంగా నిట్టూర్చి బెడ్‌రూమ్‌వైపు నడిచాను.

బయట సభా కార్యక్రమాలన్నీ నాకు వినిపిస్తూనే ఉన్నాయి. రాములమ్మ చేతుల్లోంచి పుస్తకం ఆవిష్కరింపబడింది. జనం చప్పట్లు కొడుతూ 'ఉద్విగ్న కవులకు స్వాగతం!" "నవ కవితా యుగానికి స్వాగతం!" అంటూ నినాదాలు చేశారు.

"మొదటి కాపీ అందుకోడానికి అనర్హుడనని ప్రకటించుకొని వెళ్ళిపోయిన శ్రీనివాసరావుకు బదులుగా కవిగారి ఇంటి ముందు కాపలా వున్న పోలీసు కానిస్టేబుల్ నెంబరు 268 గారిని ఈ పుస్తకం తొలికాపీని అందుకోవాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను."

భాస్కర్ మాటలతో జనంలో నవ్వులు, కేకలు, ఈలలు.

కానిస్టేబుల్ వేదికవైపు వెళ్ళినట్లున్నాడు. జనంలో మళ్ళీ చప్పట్లు.

"ఇప్పుడు ఉషోదయ సాంస్కృతిక సంఘం వాళ్ళు 'మహాకవి మరణం' అనే వీధి నాటకాన్ని ప్రదర్శిస్తారు" అంటూ భాస్కర్ వేదిక దిగిపోయాడు. డప్పు కంజరల శబ్దంలో మిళితమైన యువతీ యువకుల కాలి గజ్జెల చప్పుడుతో వీధంతా శబ్దమయమైంది.

మహాకవి మరణం నా జీవిత గాథే. స్వాతంత్ర్య పోరాటం నాటి రోజుల్తో మొదలై జనతంత్ర పార్టీ చీలికతో ముగుస్తుందా కథ. పేలవంగా అసంబద్ధంగా ఉంది కథ. ప్రజా కోర్టులో నన్ను శిక్షించటంతో కథ ముగుస్తుంది. కవిత్వంపై పంచాయితీ జరిపే కొత్త సాంప్రదాయాన్ని సూచించారు అందులో.

* * *

ఆంధ్రమిత్రకు తెలుగులో ఎక్కువ సర్క్యులేషన్ ఉన్న వారపత్రికగా పేరుంది.

పదేళ్ళుగా దానికి ఎడిటర్‌గా ఉంటున్నాడు రామగోపాలం. రామగోపాలం కాలంలోనే పత్రిక సర్క్యులేషన్‌ను అమోఘంగా పెంచుకుంది. రామగోపాలానికి సాహిత్యంపై అట్టే పట్టులేదు కానీ, రామప్పపంతులు మార్కు నక్క జిత్తులు వెయ్యటంలో దిట్ట. సర్క్యులేషన్ పెంచటం తప్ప వేరే ఐడియాలజీగానీ పాలసీగానీ లేదు రామగోపాలానికి. శ్రీశ్రీ ముఖచిత్రం వేసి శ్రీశ్రీ అభిమానుల హృదయాల్ని కొల్లగొట్టగలడు. 'ఏ' వన్ రైటర్ వ్రాసిన బూతు సీరియల్ ప్రత్యేకంగా రంగుల బొమ్మల్లో ప్రచురిస్తూ మరో వర్గం పాఠకుల్ని కట్టేసుకోగలడు. వృద్ధులకు సైతం కామ ప్రకోపాన్ని కలిగించగల సరసంపు కథలు, ఆయుర్వేద గుళికల్లా వారం వారం అందిస్తాడు. రాముడు, రావణాసురుడు ఇద్దరూ నాకు ఆత్మీయులే అనగలిగిన డిప్లొమేట్. మార్క్సిజాన్ని, బూతు కథని పక్క పక్క పేజీల్లో వేసి 'డామిట్! ఏమిట్రా యిది!' అంటే 'ప్రే! దిస్ ఈజ్ జర్నలిజం' అనగలిగిన గడుసువాడు.

ఇండియా కాఫీ హౌస్‌లో మొదటిసారి కలిశాను రామగోపాలాన్ని. ఆ రోజుల్లో కాఫీ హౌస్‌లో ప్రతి శనివారం ఒక్కొక్కళ్ళము మా జీవితపు చారిత్రక సంధ్యల్లోకి పయనించి, మమ్మల్ని ఆవేశపరచిన క్షణాల్ని, వ్యక్తుల్నీ గుర్తు చేసుకుంటూ ఉండేవాళ్ళం. ఒక శని వారపు సమావేశానికి హాజరైన రామగోపాలం "క్షనివాసరావుగారు! మీ ఉపన్యాసం వింటుంటే ఒళ్ళు పులకరించిపోతుంది. నలభై, యాభైల నాటి సాహితీలోకంలోకి తీసుకెళ్ళారు. మధురానుభూతిని కలిగించారు. ఇవి ప్రతి తెలుగువాడూ రుచి చూడవలసిన మకరందాలు. ఈ ఉపన్యాసపు ప్రతిని నాకివ్వండి. ఆంధ్రమిత్రలో సగర్వంగా ప్రచురిస్తాను" అంటూ ప్రాకులాడాడు. అతని ధోరణి విసుగెత్తి, వదిలించుకోడానికి అన్నట్లు నా దగ్గరున్న పది పేజీల చిత్తు ప్రతిని అతనికిచ్చాను. మరుసటి రోజే అయిదు వందలకు డ్రాఫ్టు పంపాడు. ఆ ఐదొందలూ ఏదో అవసరానికి ఖర్చయిపోయాయి. అలా నాకు తెలియకుండానే అతని ప్రయోజనాలకు నన్ను కమిట్ చేయించాడు. జ్ఞాప'కాలం' శీర్షిక అలా మొదలైంది. అదో ఆటోబయాగ్రఫికల్ సీరియల్ అంటూ ప్రచారాన్ని ఇచ్చాడు. హృదయపు లోతుల్లో అజ్ఞాతంగా పడివున్న ఎన్నో జ్ఞాపకాలు అసంకల్పితంగా అచ్చులోకి వెళ్ళాయి. నా గత జీవితంతో పరిచయం ఉన్న ఎందరికో, ముఖ్యంగా జనతంత్ర పార్టీ నాయకులకు ఈ రచన కంటకప్రాయం అయింది. దరిమిలా ఆంధ్రమిత్రకు వాళ్ళు లేఖా రూపంలో నిరసన వ్యక్తం చేశారు. ఆ ఉత్తరాలకు కూడా ప్రచారాన్ని యిచ్చి తన వ్యాపార నైజాన్ని బయట పెట్టుకున్నాడు రామగోపాలం. అప్పుడే జనతంత్ర పార్టీ కార్యకర్తలు మా ఇంటిపై దాడి చెయ్యడం జరిగింది. అంతటితో జ్ఞాప'కాలం' ఆగిపోయింది. క్రమంగా ఆంధ్రమిత్ర ఎడిటర్ నాపై కురిపించిన ప్రేమాభిమానాల్లో తేడా వచ్చింది. మీకు ఎప్పుడు డబ్బు కావాలన్నా చిన్న ఫోన్ కొట్టండి, సాయంత్రానికి చెక్కు పంపిస్తాను అన్న మనిషి సుధ ఎన్నిసార్లు కబురుచేసినా ఏదో సాకు చెప్పి దాటవేసేవాడు.

నాకు జ్ఞానపీఠం అవార్డు ప్రకటించటంతో ఆంధ్రమిత్ర ఎడిటరు మరోసారి తన రంగు మార్చాడు. ముందు టెలిగ్రాము శుభాకాంక్షలు పంపాడు. నా ఫోటో ముఖ చిత్రంగా

వేశాడు ఆ వారం పత్రికపై. 'చై ఎత్తి జై కొట్టు మహాకవికి' అంటూ సుదీర్ఘమైన ఎడిటోరియల్ రాశాడు. ఇద్దరు యువకవుల చేత నా కవితా వైశిష్ట్యంపై వ్యాసాలు రాయించి ప్రచురించాడు. నావి రెండు పాత కవితలు, ఒక వ్యాసం ప్రచురించాడు. జ్ఞాన పీఠపు కవికి తెలుగువారి ప్రియతమ పత్రిక నీరాజనం అంటూ ఘనంగా చెప్పుకొన్నాడు. అంతటితో ఆగకుండా సబ్-ఎడిటర్ నీలా చౌదరిని మా ఇంటికి పంపాడు.

నీలా చౌదరి ఖరీదైన బొకే తోటి, స్వీట్స్‌తోటి ఇంటికి వచ్చింది. రెండు వేల రూపాయిల చెక్కును కూడా అందించింది. గతంలో పత్రిక ఆర్థిక ఇబ్బందుల్లో వున్న కారణంగా కోరినప్పుడు డబ్బు ఇవ్వలేకపోయాము అంటూ పశ్చాత్తాపాన్ని కురిపించింది. 'మిమ్మల్ని సన్మానించుకోవటం గొప్ప అదృష్టంగా భావిస్తుంది ఆంధ్రమిత్ర. ఈ అవార్డు తాలూకు ఆనందాన్ని ఆంధ్రమిత్ర కూడా పంచుకొంటుంది. ఆగిపోయిన మీ జ్ఞాప'కాలం' మళ్ళీ ప్రారంభిస్తే బాగుండునని మా కోరిక. లక్షలాది పాఠకుల కోరిక కూడా." కళ్ళలో అభిమానాన్ని కురిపిస్తూ చెప్పింది నీలా చౌదరి.

ఆంధ్రమిత్ర కోసం కాదు కానీ, ఒకానొక మానసికావేశం నన్ను ఆవహించి, నా జీవితాన్ని రికార్డు చేసి భవిష్యత్తుకోసం పదిలపరచాలన్న వింత కోర్కె రగిలి మళ్ళీ జ్ఞాప'కాలం' శీర్షిక రాయడం మొదలుపెట్టాను.

తమ వర్తమానం వెనుకనున్న గతపు కీకారణ్యం లోకి తొంగి చూసుకోడానికి భయపడుతుంటారు రాజకీయనాయకులు. వాళ్ళ గతంపై ఏ చిన్న వెలుగు తళుక్కుమన్నా సహించలేరు. నాయకుల కన్నా నాయకుల చుట్టూ మూగిన అనుచరులు ఎక్కువ హడావుడి చేస్తుంటారు ఇలాంటి విషయాల్లో. అలాంటి అనుచరుడొకడు ఆకాశరామన్న ఉత్తరం రాశాడు నాకు. "మీ ప్రాణాలపై ఆశ వుంటే ఈ శీర్షిక ఆపివేయండి!" అంటూ.

'ఈ బెదిరింపులకేం వచ్చె, ఇలాంటివి మనకు కొత్తవి కావు కదా! జనతంత్ర పార్టీలో ప్రక్షాళనం జరిగి పునః తేజితం కావడానికైనా ఈ శీర్షికను కొనసాగించండి!" సుధ మాటలు నాకు ధైర్యాన్నిచ్చాయి. వెరపు ఎరుగని కార్యకర్త సుధ. జీవిత ప్రస్థానంలో ఎన్ని ఆటుపోట్లు ఎదుర్కోలేదు ఇద్దరం కలిసి. ఈ బెదిరింపులో లెక్కా!

* * *

"శ్రీనివాసరావుగారు మీరే కదండి?" ఒక మొరటు గొంతు ప్రశ్నించింది.

"అవును బాబు! మీరెవరు?" ప్రేమగా పలుకరించాను. సమాధానానికి బదులుగా "వెయ్యండిరా!" అనే అరుపు వినబడింది. నుదుటిపై ఇనుపరాడ్ ఒకటి 'టప్' మంటూ తగిలింది. భరింపరాని బాధ. దాన్ని అనుసరిస్తూ ఒకదానిపై ఒకటి దెబ్బలు తలపై పడ్డాయి. నుదిటిపై రక్తం కాలువలు కట్టింది. కళ్ళ ముందు ప్రపంచం గిర్రున తిరుగుతోంది. ప్రపంచం నుండి దూరంగా విసిరి వేయబడుతున్నట్టుగా వుంది. కళ్ళలో మగత. స్పృహతప్పుతున్న భావన.

అందమైన కావ్యంలాంటి జీవితానికి ఇది ముగింపా? సుధ ఏమౌతుందో? జనం

ఈ వార్తకు ఎలా స్పందిస్తారో? కాలం ఈ సంఘటనపై ఏం సంజాయిషీ ఇచ్చుకుంటుందో?

జీవిత చరిత్రలన్నీ పుట్టుకతో మొదలై, మరణంతో ముగుస్తాయి. శ్రీనివాసరావు లాంటి మహాకవి, మరణం తరవాత కూడా జీవిస్తాడు. అందుకే ఆయన జీవిత చరిత్రను పొడిగించాల్సి వచ్చింది. శ్రీనివాసరావు రాయలేని ఈ చివరి పుటల్ని ఆయన జీవిత సహచరినైన నేను రాస్తున్నాను.

* * *

శ్రీనివాసరావు నాకిక లేడనే నిజాన్ని మనసు అంగీకరించలేక పోతూంది. శ్రీనివాసరావు నా ఆశ, ఆశయం, నా ఆశ్రయం, నా జీవనోత్సాహం. అతను లేని ప్రపంచంలో నా కింకేమైనా అనుబంధాలు మిగిలి వున్నాయా? అనిపిస్తుంది. శ్రీనివాసరావు నాకు భర్త మాత్రమేనా? పోరాటాల్లో సహచరుడు. ప్రపంచ పరిణామాల అధ్యయనంలో సహపాఠి. శ్రీనివాసరావు నాకు తండ్రి. గురువు, జీవన సర్వస్వం.

ఎక్కువసేపు మృతదేహాన్ని వుంచకూడదని డాక్టర్లు చెప్పారు. సంతాప సందేశాల తమాషా కొనసాగుతూనే వుంది. పది గంటల వేళ మొదలైంది అసలు డ్రామా. ఆంధ్రకవుల, కవితాభిమానుల హిపోక్రసీని వేయి ముఖాలతో బహిర్గతం చేసిన సంఘటనలు.

సరిగ్గా పది గంటలకు ఒక లారీ నిండుగా జనం దిగారు. అందులోంచి ఎర్ర యూనిఫారాలు వేసుకొన్న జనతంత్ర పార్టీ కార్యకర్తలు గబగబా దిగి వచ్చారు. మనిషి ఎత్తు ఎర్ర జెండాని నాల్గువైపుల నుండి పట్టుకొని శ్రీనివాసరావుపై కప్పారు. గులాబీలు, మందారాలు మొదలైన ఎర్రటి పూలను బుట్టలతో తెచ్చి శ్రీనివాసరావు దేహంపై చల్లారు. ఆ ఎర్ర దనపు అర్ణవం మధ్య ప్రత్యక్షమయ్యాడు జనతంత్ర పార్టీ ప్రధాన కార్యదర్శి రాఘవరావు. సాంస్కృతిక దళం యువకులు లాల్ సలామ్ పాటను అందుకున్నారు. గద్గద కంఠంతో రాఘవరావు తన సంతాపాన్ని తెలియజేశాడు. "శ్రీనివాసరావు లేని జనతంత్ర పార్టీని ఊహించలేకపోతున్నాను" అని బావురుమన్నాడు. ప్రజా రచయితల సంఘం కవులు హడావుడిగా రాసుకొచ్చిన ఎలిజీలతో సిద్ధంగా వున్నారు.

ఉద్వేగభరితమైన వాతావరణంలోకి ప్రోగ్రసివ్ ఫోరమ్‌వాళ్ళ ఊరేగింపు చొచ్చుకొచ్చింది. వందకు పైగా యువతీ యువకులు. "మహాకవి శ్రీనివాసరావుకు లాల్‌సలామ్" అనే బ్యానర్‌తో ప్రత్యక్షమయ్యారు. "మహాకవిని కిరాయి గూండాల సాయంతో పొట్టన బెట్టుకొన్న రాఘవరావూ గోబ్యాక్!" అంటూ నినాదాలు చేశారు.

ఆ హడావుడిలోనే విద్యామంత్రి ఎస్కార్టుతో సహా వచ్చాడు. అకాడమీ కార్యదర్శి, సభ్యులు, ఆస్థానకవి వనమాలి పూలమాలలతో ప్రత్యక్షమయ్యారు. "సుధ గారూ! శ్రీనివాసరావు మన మధ్యలో లేకున్నా ఆయన స్ఫూర్తి మరో వందేళ్ళు ఆంధ్రదేశంలో బ్రతికి వుండేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాము. ఆయన పేరు మీద యూనివర్సిటీల్లో పీఠాలు ఏర్పాటు చేస్తున్నాము. ఆయన విగ్రహాన్ని టాంక్‌బండ్ మీద నెలకొల్పుతున్నాము. ఆయన రచనల సంకలనాల ప్రచురణ బాధ్యత కూడా అకాడమీ తీసుకోవడానికి

నిర్ణయించింది" అంటూ వనమాలి ప్రభుత్వ ప్రకటన లాంటి సంతాపాన్ని ముగించాడు.

పోలీసులు ట్రక్కు పైకి శ్రీనివాసరావు దేహాన్ని చేర్చడానికి ప్రయత్నిస్తున్నారు. మహాకవి శ్రీనివాసరావుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు చేయబోతున్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారీ కార్యక్రమాలు. ఆయన శరీరంపై ఎర్ర జెండాని వుంచాలా, లేదా అని పోలీసు అధికారులకు సందేహం వచ్చింది. బాగా రాటుతేలిన ఒక వృద్ధ పోలీసు అధికారి ఎర్రజెండాని లాగివేసి జాతీయ పతాకాన్ని కప్పమంటూ ఆదేశమిచ్చాడు.

జనతంత్ర పార్టీ కార్యకర్తలూ, ప్రోగ్రసివ్ ఫోరం సభ్యులూ ఒక్కసారిగా నినాదాలు చేశారు "ఎర్రజెండాపై పోలీసుల అత్యాచారం నశించాలి!" "మహాకవి శ్రీనివాసరావు మృత దేహాన్ని పోలీసుల బారి నుండి కాపాడండి!", "ప్రజాకవికి ప్రజలే అంత్యక్రియలు చేయాలి", "పోలీస్ గో బ్యాక్" నినాదాలతో వీధంతా మారుమోగింది. విద్యామంత్రి అసహనంతో వనమాలివైపు చూశాడు. "అల్లరి మూకలు, మీరు పట్టించుకోవద్దు! ముందు మీరు పదండి. పరిస్థితి నేను దగ్గరుండి చక్కబరుస్తాను" అంటూ మంత్రి గారిని కారు వద్దకు తీసుకొచ్చి వినయంగా సాగనంపాడు.

వీధిలో నినాదాల హెూరు, పోలీసులు ఎర్రజెండాని లాగివేసే కార్యక్రమాన్ని ఆపివేసి అధికారుల ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు.

మరణాన్ని సైతం రాజకీయం చెయ్యగలిగిన వ్యవస్థ! ఎంత దౌర్భాగ్య స్థితి ఈ దేశానిది. కళ్ళు తుడుచుకొని గుండె దిటవు చేసుకొని ఆ కోలాహలం మధ్యకు వచ్చాను. అందరికీ చేతులెత్తి నమస్కరించి, నినాదాలు ఆపమని అభ్యర్థించాను. క్షణకాలంపాటు నిశ్శబ్దం. ఆ నిశ్శబ్దాన్ని చీలుస్తూ, సమూహాల్ని దీనంగా అర్థించాను.

"సాహితీ అభిమానులకు, రాజకీయ ప్రముఖులకు, అకాడమీ నేతలకు నా నమస్కారాలు. మీ అందరికీ వినయంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను. మరణించిన శ్రీనివాసరావుపై మీకున్న అనురాగం నాకు తెలుసు. శ్రీనివాసరావు అన్నట్టు ఆయన జీవితం, కవిత అన్నీ ప్రజలకే అంకితం. నిజానికి ఆయనపై నా కన్నా ప్రజలకే ఎక్కువ అధికారాలున్నాయి.

మీ అందరినీ దీనంగా వేడుకొంటున్నాను. కన్న కొడుకును, జీవిత సహచరుణ్ణీ పోగొట్టుకున్న నిర్భాగ్యురాల్ని. శ్రీనివాసరావు ఈ చివరి క్షణాల్ని రక్తసిక్తం చెయ్యకండి! నా గుండె మరింకే విషాదాన్ని తట్టుకోలేదు.

ఈ వృద్ధురాలి దీన విన్నపాన్ని మన్నించి దయచేసి అందరూ వెళ్ళిపోండి! మనిషి పోయాడు. ఒట్టికట్టె ఇది. దీన్ని మట్టి చెయ్యడానికి ఇన్ని పంతాలు, పోట్లాటలు వద్దు. అందరూ వెళ్ళిపొండి! ఒక్కదాన్నే ఈ అంత్యక్రియలు చేసుకుంటాను.

శ్రీనివాసరావును వెలివేసిన జనతంత్ర పార్టీ ఇప్పుడు ఆయన అంత్యక్రియలకు పరిగెత్తుకు రావడం వింత! లక్ష రూపాయిల అవార్డుకు అమ్ముడయిపోయాడని నిందించిన ప్రోగ్రసివ్ ఫోరం ఆయన శవాన్ని భుజాలపై కెత్తుకోవాలని చూడడం ఎంత చిత్రం!

జీవితమంతా కష్ట జీవులకు కాపు కాసిన శ్రీనివాసరావుకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలా?

అయిదు నిముషాల్లో పోలీసులు, జనతంత్ర పార్టీ కార్యకర్తలూ, ప్రోగ్రసివ్ ఫోరం పిల్లలూ ఇక్కడి నుండి వెళ్ళకపోతే నేను ఆత్మత్యాగం చేసుకుంటాను. శ్రీనివాసరావు సాక్షిగా చెబుతున్నాను" మాటలు ఆపి చేతిలోని వాచీ వైపు చూసుకోవటం మొదలు పెట్టాను.

ఒక్కొక్కళ్ళూ వెళ్ళిపోవటం మొదలు పెట్టారు.

• ఆంధ్రజ్యోతి వారపత్రిక, 25 మార్చి, ఏప్రిల్ '94 •